WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టై ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం
# స్వర్ణసాగరం
www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 209 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | శుక్రవారం 25 జూలై 2025 | వెల : 2-00



## దూసుకొచ్చిన పాక్ డ్రోన్లు

- పేల్చిసిన భారత భద్రతా బలగాలు
- ఈ ఆపరేషన్‌లో అదుపులోకి మొత్తం ఆరు డ్రోన్లు
- వాటిల్లో మూడు డ్రోన్లు ఏరియల్ ఫొటోగ్రఫీ,వీడియోల్ని తీసేందుకు ఉపయోగించే డీజీఐ మావిక్ డ్రోన్‌లు
- భారత భద్రతా బలగాలు చేపట్టిన ఈ ఆపరేషన్లు పాకిస్తాన్ ప్రేరిత నార్కో-టెర్రర్ నెట్‌వర్క్‌లపై గట్టి దెబ్బ

# రూ.79,900 కోట్ల పెట్టుబడులకు ఓకే



- తద్వారా లక్షన్నర ఉద్యోగాలు: మంత్రివర్గం
- ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ పాలసీ 4.0కి ఆమోదం
- ఐటీ, డేటా హబ్‌గా విశాఖ

స్వర్ణసాగరం అమరావతి

రాష్ట్ర భవిష్యత్‌కు పటిష్ఠ పునాదులు వేయాలనే లక్ష్యంతో రూ.79,900 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ఈ పెట్టుబడుల ద్వారా దాదాపు లక్షన్నర ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన విలేకరులకు వివరించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకెళ్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం.. భవిష్యత్‌లో పెట్టుబడిదారులందరికీ ఏపీ కేంద్రంగా మారేలా పాలసీలు తెస్తున్నట్లు చెప్పారు. ఈ దిశగానే ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ ఉత్పాదక పాలసీ 4.0కి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఇప్పటివరకు ఈ పాలసీ లేకపోవడంతో.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే భారీ, మధ్య, చిన్నతరహా సంస్థలకు ప్రోత్సాహకాలను అందించే వీలు లేకుండా పోయింది. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలు భారీగా ప్రోత్సాహకాలు ఇస్తుండడంతో అవన్నీ అటు వెళ్లిపోతున్నాయి. దీంతో ఏపీలోనూ రూపొందించిన ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ తయారీ పాలసీ 2025-30ని రాష్ట్ర కేబినెట్ ఇప్పుడు ఆమోదించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాబోయే కాలంలో విశాఖను సాఫ్ట్‌వేర్, డేటా సెంటర్‌గా తయారీ చేయాలన్న లక్ష్యంతో పలు సంస్థల పెట్టుబడులకు అంగీకారం తెలిపినట్లు మంత్రి చెప్పారు.



## మద్యం స్కామ్ వెనుక ఉన్న కుట్ర కోణాలు వెలికి తీయాలి

- ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- సిట్ పద్ధతి చూస్తే కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉందన్నారు షర్మిల. డిస్టలరీల వద్ద కమీషన్‌లు, బినామీలు, నగదు రవాణా అంశాలతోపాటు వైఎస్ జగన్‌కి నెలకు రూ.60కోట్లు అందేవని మాత్రమే సిట్ అధికారులు చెబుతున్నారు.
- ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఈ డిజిటల్ యుగంలో సైతం కేవలం నగదు రూపంలో మద్యం విక్రయాలు జరిపారు.



భారత్-యూకే మధ్య
## కీలక ట్రేడ్ డీల్

- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు
- ఇండియా, ఇంగ్లాండ్ మధ్య కీలక వాణిజ్య ఒప్పందం
- బ్రిటన్, భారత్ భాగస్వామ్యంలో కొత్త అధ్యాయం
- భారత్‌లో త్వరలో ఆరు బ్రిటన్ వర్సిటీలు తమ క్యాంపస్‌లు ఏర్పాటు
- ఇరుదేశాల సేవల రంగం.. ఆర్థిక, సాంకేతిక రంగాలకు ఊతమిస్తుంది

## నకిలీ ఓటర్లను మేము ఎలా అనుమతిస్తాం?

- "మన దేశ ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం తల్లి లాంటిది
- దానికి అనుగుణంగానే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టాం
- విమర్శలు, వివాదాలకు భయపడి రాజ్యాంగానికి వ్యతిరేకంగా మేం ఎలా పనిచేయగలం?
- ద ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్‌కుమార్ ప్రకటన




# మంత్రివర్గ ప్రక్షాళన?



- 8 మంది మంత్రులకు చెక్
- సీనియర్లుకు అవకాశం
- కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు 13 నెలలు పూర్తవుతోంది
- మంత్రుల పనితీరుపై ఎప్పటికప్పుడు మదింపు జరుగుతోంది
- పలువురు మంత్రులను హెచ్చరిస్తూ సీఎం ఎప్పటికప్పుడు పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు.
- ఓటమి వర్గాల్లో మంత్రివర్గ విస్తరణ పై చర్చ

స్వర్ణసాగరం విజయవాడ

మంత్రివర్గ విస్తరణ పైగత కొద్ది రోజులుగా అనేక రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే తాజాగా మరింత ఎక్కువయ్యాయి. మంత్రివర్గ ప్రక్షాళన ఖాయమని తెలుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు 13 నెలలు పూర్తవుతోంది. మంత్రుల పనితీరుపై ఎప్పటికప్పుడు మదింపు జరుగుతోంది. పలువురు మంత్రులను హెచ్చరిస్తూ సీఎం ఎప్పటికప్పుడు పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. అయినా సరే చాలామంది తీరులో మార్పు రావడం లేదు. ఈ తరుణంలో మంత్రివర్గ ప్రక్షాళనకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఓటమి వర్గాల్లో మంత్రివర్గ విస్తరణ పై చర్చ సాగుతోంది. అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న తరుణంలో మంత్రివర్గ విస్తరణ జరుగుతుందా? మరికొంత సమయం వేచి చూస్తారా? అన్న చర్చ కూడా సాగింది. అయితే ఏపీ మంత్రివర్గ ప్రక్షాళనకు సంబంధించి ముహూర్తం ఫిక్స్ - మిగతా3లో



## నాలుగోరోజూ సాగని చర్చ..

- ఉభయ సభలు వాయిదా
- ప్రతిపక్ష ఎంపీల నిరసనలు, రభస కొనసాగడంతో వరుసగా గందరగోళం పరిస్థితులు
- బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన
- విపక్ష ఎంపీల తీరుపై స్పీకర్ ఓం బిర్లా అసహనం

## అభిమానమా?.. ఉన్మాదమా..?



- రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి
- పోలీస్ వ్యవస్థను దారుణంగా నిర్వీర్యం చేశారు
- కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో నియంతృత్వంతో కూడిన రాచరిక పాలన నడుస్తోంది
- రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపుతప్పాయి.
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ కారుమూరి



అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటులో
## క్యూపీఐఏఐ భాగస్వామ్యం

సీఎం చంద్రబాబుతో ఆ సంస్థ వ్యవస్థాపకులు నాగేంద్ర నాగరాజన్ భేటీ

## ఛత్తీస్‌గఢ్‌లో 51 మంది మావోయిస్టుల లొంగుబాటు!



- సుక్మా జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు
- 2024 నుంచి ఇప్పటివరకు బీజాపూర్ జిల్లాలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్‌లలో 185 మంది మావోయిస్టులు హతమయ్యారు
- 803 మంది అరెస్టు కాగా.. 431 మంది లొంగిపోయారు

# నకిలీ ఓటర్లను మేము ఎలా అనుమతిస్తాం?




**దిల్లీ:** బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిందే. ప్రతిపక్షాల విమర్శలపై తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. నకిలీ ఓటర్లను ఎలా అనుమతిస్తామంటూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమర్థించుకుంది. ఈమేరకు కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్‌కుమార్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. "మన దేశ ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం తల్లి లాంటిది. దానికి అనుగుణంగానే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం తో పాటు పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టాం. ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేశాం. విమర్శలు, వివాదాలకు భయపడి రాజ్యాంగానికి వ్యతిరేకంగా మేం ఎలా పనిచేయగలం? చనిపోయిన ఓటర్ల పేరుతో నకిలీ ఓట్లను ఎలా అనుమతిస్తాం? శాశ్వతంగా వలస వచ్చిన వారు, రెండు ప్రాంతాల్లో ఓటు రిజిస్టర్ చేసుకున్న వారు, విదేశీయులతో ఎలా ఓటు వేయిస్తాం? పారదర్శక పనితీరు కోసం ప్రక్షాళన చేయకూడదా? రాజకీయ సిద్ధాంతాలకు అతీతంగా దేశ పౌరులంతా ఈ ప్రశ్నలపై పునరాలోచన చేయాలి" అని సీఈసీ తన ప్రకటనలో సూచించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణలో కీలక విషయాలు బయటపడ్డాయి. రాష్ట్రంలో 52 లక్షల మంది ఓటర్లు సంబంధిత చిరునామాల్లో లేరని వెల్లడైంది. 18 లక్షల మంది ఓటర్లు చనిపోగా, 26 లక్షల మంది ఇతర నియోజకవర్గాలకు మారినట్లు ఈసీ తెలిపింది. మరో ఏడు లక్షల మంది ఓటర్లు రెండు చోట్ల ఓటు నమోదు చేసుకున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభానికి ముందు రాష్ట్రంలో 7.89 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. ఇప్పటివరకు 7.68 కోట్ల మంది వివరాలను సేకరించినట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ఆగస్టు 1 నుంచి ముసాయిదా ఎన్నికల జాబితా ప్రచురించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఇప్పటికే వీటికి సంబంధించిన వివరాలను రాష్ట్రంలోని 12 ప్రధాన పార్టీలతో పంచుకున్నామని, తద్వారా పేర్లను ఎందుకు తొలగించామో అందరికీ తెలుస్తుందని పేర్కొంది. సెప్టెంబర్ 1 వరకు సామాన్యులు సహా ఎవరైనా అభ్యంతరాలు తెలపవచ్చని సూచించింది. అయితే, ఈ సమగ్ర సవరణను కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఓటర్లను తొలగిస్తున్నారని దుయ్యబట్టాయి. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం అత్యున్నత న్యాయస్థానం వద్ద పెండింగ్‌లో ఉంది.

# నాలుగోరోజూ సాగని చర్చ..



పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నాలురోజు కూడా ఎలాంటి చర్చా లేకుండానే ముగిశాయి. ప్రతిపక్ష ఎంపీల నిరసనలు, రభస కొనసాగడంతో వరుసగా గురువారం కూడా సమావేశాలో గందరగోళం పరిస్థితులు నెలకొన్నాయి. సభా కార్యకలాపాలకు తీవ్ర అవరోధం ఏర్పడడంతో రాజ్యసభ లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడ్డాయి.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వరుసగా నాలుగోరోజు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు ఉభయసభలు సమావేశమయ్యాయి. సభ ప్రారంభం కాగానే లోక్‌సభలో విపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. వాయిదా తీర్మానాలపై చర్చించాలని డిమాండ్ చేశారు. బీహార్ ఓటర్ల జాబితా సవరణపై చర్చకు పట్టుబట్టారు. స్పీకర్ ఓం బిర్లా ఎంత నచ్చజెప్పినా సభ్యులు వినిపించుకోలేదు. సభలో తమ నిరసనలు కొనసాగించారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. విపక్ష ఎంపీల తీరుపై స్పీకర్ ఓం బిర్లా అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో లోక్‌సభను మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అయితే మధ్యాహ్నం సభ ప్రారంభమైనప్పటికీ అదే పరిస్థితి కొనసాగింది. దీంతో సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. విపక్ష సభ్యుల నిరసనల మధ్యే ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.

**విపక్షాల ప్రధాన డిమాండ్లు**

బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాకు ప్రత్యేక నిశిత సవరణ (సర్) చేపట్టడం, పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ప్రకటించడం వంటి అంశాలపై వెంటనే చర్చను చేపట్టాలన్న విపక్ష సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎమ్మెల్యే పాశింది యమధర్మ పాలన

## - ఎమ్మెల్సీ మేరిగ విమర్శ




స్వర్ణసాగరం వాకాడు

కూటమి ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ గూడూరు నియోజకవర్గంలో పోలీసులను అడ్డుపెట్టుకుని ధర్మపాలనకు విరుద్ధంగా యమధర్మ పాలన చేస్తున్నారని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మేరీగ మురళీ ఆరోపించారు. గురువారం స్థానిక బాలకృష్ణారెడ్డి కళాక్షేత్రం నందు స్థానిక వైసీపీ నేత కొడవలూరు భక్తవత్సల రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన "బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ " కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కూటమి ప్రభుత్వ ఎన్నికల మేనిఫెస్టో పై రూపొందించిన క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఇప్పుడు ప్రజలకు చంద్రబాబు చేస్తున్న మోసాలను, రెడ్ బుక్ రాజ్యాంగ అరాచకాలను ప్రజలకు వివరించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంధాలుగా భావించి ముఖ్య మంత్రిగా 99% హామీలను నెరవేర్చారని, తరువాత అబద్ధపు హామీలను ఇచ్చిన చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వానికి ఇప్పటి ప్రభుత్వానికి తేడాను బాబు చేసిన మోసాన్ని ప్రజలకు క్యూఆర్ కోడ్‌తో గుర్తుచేయాలని తెలిపారు.

**రెట్టింపు వడ్డీతో చెల్లిస్తాం : కొడవలూరు భక్తవత్సల రెడ్డి**

బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా స్థానిక టిడిపి నేతలనుద్దేశించి వైసీపీ సీనియర్ నేత కొడవలూరు భక్తవత్సల రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని స్థానిక కూటమి నేతలు విధ్వంస పాలనకు తెర తీశారని, ఇసుక గ్రావెల్ దోపిడీ చేయడం, పార్టీల పేరుతో చిరు ఉద్యోగులను తొలగించడం, ప్రశ్నించిన ప్రజా ప్రతినిధులపై అక్రమ కేసులు బనాయించడం వంటి పాలనకు తెర తీస్తూ, అనేకమంది పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో ఏళ్లు అధికారాన్ని చూసామని అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఏనాడు ఇలాంటి కుతంత్ర రాజకీయాలకు అవకాశం ఇవ్వలేదన్నారు. ప్రజలందరూ తనను తన వద్దకు వచ్చిన సమస్యలను ఎటు తేల్చరని, ఒక సచ్చు వాడిలా సాగదీతతో వ్యవహరిస్తారని నన్ను తిట్టుకున్నప్పటికీ సమస్యను పెంచి పోషించే ఉద్దేశం తనకు లేకపోవడంతోనే ప్రజల చేత మాటలు పడినా సహిస్తున్నానే కానీ చేతకాక కాదు అన్నారు. స్థానిక నేతలు చేస్తున్నా అరాచకాలు మొత్తం గుర్తిస్తున్నామని తాము అధికారంలోకి వస్తే అంతకు రెట్టింపు వడ్డీతో సహా చెల్లిస్తానని బాలకృష్ణారెడ్డి సేవా క్షేత్రం, మహాత్మా గాంధీ సాక్షిగా కార్యకర్తలకు ప్రమాణం చేస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రైతు రామకృష్ణ, వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, సర్పంచ్ రత్నమ్మ, నేదురుమల్లి హిమ కుమార్ రెడ్డి, పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి, తదితర వైసీపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు



# భారత్-యూకే మధ్య కీలక ట్రేడ్ డీల్



భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ యూకే పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఇవాళ లండన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో మోదీ భేటీ అయ్యారు. ఈ భేటీలో రెండు దేశాల మధ్య కీలక ట్రేడ్ డీల్ కుదిరింది. భారత్-యూకేల మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పై ఇరుదేశాలూ సంతకాలు చేశాయి. ప్రధాని మోదీ, యూకే ప్రధాని కీర్ స్టార్మర్ సమక్షంలో ఇదరుదేశాల వాణిజ్య శాఖ మంత్రులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. కాగా, భారత్-యూకేల మధ్య ఈ వాణిజ్య ఒప్పందం కోసం జరిపిన చర్చలు ముగిసినట్లు ఇరు దేశాలు మే 6న ప్రకటించిన విషయం తెలిసిందే. 2030 నాటికి ఈ రెండు ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్యాన్ని 120 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేసేదిగా ఈ ఒప్పందం ఉంది. తోలు, పాదరక్షలు, దుస్తులు వంటి ఉత్పత్తుల ఎగుమతిపై పన్నులను తొలగించాలని, బ్రిటన్ నుండి విస్కీ, కార్ల దిగుమతులను చౌకగా మార్చాలని ఈ వాణిజ్య ఒప్పందంలో పొందుపర్చారు. భారత్-యూకేల ఈ ఒప్పందంలో వస్తువులు, సేవలు, ఆవిష్కరణ, మేధో సంపత్తి హక్కులు తదితర అంశాలను ఇందులో ప్రతిపాదించారు. అంతకు ముందు యూకే పర్యటనపై ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఈ పర్యటన చాలా దోహదపడుతుందన్నారు. మన ప్రజలకు శ్రేయస్సు, వృద్ధి ఉద్యోగ సృష్టిని పెంచడంపై దృష్టి ఉంటుందని చెప్పారు. ప్రపంచ పురోగతికి బలమైన భారతదేశం-యూకే స్నేహం చాలా అవసరమని తెలిపారు. ఇక్కడి భారతీయ సమాజం నుంచి లభించిన హృదయపూర్వక స్వాగతం తనను కదిలించిందని వెల్లడించారు. భారతదేశ పురోగతి పట్ల వారి అభిమానం మక్కువ నిజంగా నా హృదయాన్ని తాకిందని ప్రధాని ట్వీట్ చేశారు. భారత్-బ్రిటన్ సంబంధాల్లో గురువారం చరిత్రాత్మక రోజు అని ప్రకటించారు భారత ప్రధాని నరేంద్ర మోదీ. చాలా ఏళ్ల కృషి తర్వాత భారత్-బ్రిటన్ మధ్య సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరగడం సంతోషకరమన్నారు. సైబర్ సెక్యూరిటీ అంశాల్లో ఇరుదేశాలు కలిసి ముందుకు సాగుతామని మోదీ చెప్పారు. బ్రిటన్, భారత్ భాగస్వామ్యంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని కూడా మోదీ తెలిపారు. భారత్‌లో త్వరలో ఆరు బ్రిటన్ వర్సిటీలు తమ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తున్నాయని ప్రధాని మోదీ చెప్పారు. ఇరుదేశాల సేవల రంగం.. ఆర్థిక, సాంకేతిక రంగాలకు ఊతమిస్తుందని మోదీ అన్నారు. ఈ ఒప్పందం ద్వారా సులభతర వాణిజ్య విధానానికి మరింత ఊతం వచ్చిందని వ్యాఖ్యానించారు. 'ఇరుదేశాల మధ్య ఉపాధి కల్పన అవకాశాలు విస్తృతం అవుతాయి. భారత్-బ్రిటన్ భాగస్వామ్యంలో విజన్-2035 లక్ష్యంగా సాగుతున్నాం' అని మోదీ తెలిపారు.

## దూసుకొచ్చిన పాక్ డ్రోన్లు



**అమృత్‌సర్:** నార్కో-టెర్రర్ నెట్‌వర్క్‌లను పెంచిపోషిస్తున్న పాకిస్తాన్‌కు భారత భద్రతా బలగాలు షాకిచ్చాయి. పంజాబ్ సరిహద్దుల్లో వరుస ఆపరేషన్లు చేపట్టిన బీఎస్ఎఫ్ పాక్ నుంచి భారత్ వైపు వచ్చిన ఆరు డ్రోన్లను కూల్చేసింది. ఈ ఆపరేషన్‌లో మొత్తం ఆరు డ్రోన్లను అదుపులోకి తీసుకున్నారు. వాటిల్లో మూడు డ్రోన్లు ఏరియల్ ఫొటోగ్రఫీ,వీడియోల్ని తీసేందుకు ఉపయోగించే డీజేఐ మావిక్ డ్రోన్‌లు కాగా.. మరో మూడు డ్రోన్లలో మూడు పిస్టల్స్,వాటిల్లో బుల్లెట్లను నింపేందుకు వినియోగించే మ్యాగిజైన్‌ను, 1.1 కేజీ హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బీఎస్ఎఫ్ విభాగం అధికారికంగా ప్రకటించింది. అమృత్‌సర్ జిల్లాలోని మోధే గ్రామం వద్ద రాత్రి సమయంలో ఐదు డ్రోన్లను బీఎస్ఎఫ్ జవాన్లు టెక్నాలజీ సాయంతో వాటిని కూల్చేశారు. అక్కడ మూడు తుపాకులు, మూడు మ్యాగజైన్లు,హెరాయిన్ ఉన్న నాలుగు ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. టర్న్ టారన్ జిల్లాలోని డాల్ గ్రామం వద్ద పిస్టల్ భాగాలు, మ్యాగజైన్‌ను గుర్తించారు. అటారి గ్రామం వద్ద మరో డ్రోన్‌ను అడ్డుకుని రెండు మ్యాగజైన్లు స్వాధీనం చేసుకున్నారు. భారత భద్రతా బలగాలు చేపట్టిన ఈ ఆపరేషన్లు పాకిస్తాన్ ప్రేరిత నార్కో-టెర్రర్ నెట్‌వర్క్‌లపై గట్టి దెబ్బగా భావిస్తున్నారు. బీఎస్ఫ్, పంజాబ్ పోలీసుల సమన్వయంతో ఈ ఆపరేషన్లు జరిగాయి.కాగా, ఇలాంటి ఘటనలు సరిహద్దు భద్రతను మరింత కఠినంగా చేయాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి.

## ఛత్తీస్‌గఢ్‌లో 51 మంది మావోయిస్టుల లొంగుబాటు!



**చర్ల:** ఛత్తీస్‌గఢ్‌లో పెద్దఎత్తున మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. నారాయణపూర్, సుక్మా, బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో కలిపి మొత్తం 51 మంది ఆయుధాలు వీడారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు ముమ్మరం చేయడం, ప్రభుత్వ పునరావాస విధానం అమలుతో నక్సల్స్ కార్యకలాపాలు పూర్తిగా తగ్గిపోతున్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. 2024 నుంచి ఇప్పటివరకు బీజాపూర్ జిల్లాలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్‌లలో 185 మంది మావోయిస్టులు హతమయ్యారని, 803 మంది అరెస్టు కాగా.. 431 మంది లొంగిపోయారన్నారు.

బీజాపూర్ జిల్లాలో బస్తర్ ఐజీ సుందర్ రాజ్ ఎదుట 25 మంది లొంగిపోయారు. వీరిపై రూ.1.15 కోట్ల మేర రివార్డు ఉన్నట్టు ఐజీ వెల్లడించారు. ప్రోత్సాహకంగా వారికి రూ.50 వేల చొప్పున చెక్కులు అందజేశారు.

కాంకేర్ జిల్లా ఎస్పీ కల్యాణ్ ఎలిసెల ఎదుట 13 మంది లొంగిపోయారు. వీరిలో మిలటరీ కంపెనీ కమాండర్ మంగులు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. వీరిపై రూ.62 లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు.

సుక్మా ఎస్పీ కిరణ్ జవాన్ ఎదుట ఐదుగురు లొంగిపోయారు. వీరిపై రూ.6 లక్షల రివార్డు ఉంది. వారిలో కొంతమంది గతంలో పలు విధ్వంసకర ఘటనల్లో పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు.

నారాయణపూర్ ఎస్పీ రాబిన్‌సన్ గుడియా ఎదుట నలుగురు మహిళా మావోయిస్టులు సహా ఎనిమిది మంది లొంగిపోయారు. వీరిలో కమాండర్ కమలేశ్ ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. వీరందరిపై రూ.33 లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు.

## లోయలో పడిన బస్సు.. ఐదుగురు మృతి



**మండీ:** హిమాచల్‌లోని మండీలో ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. హిమాచల్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (హెచ్‌ఆర్‌టీసీ)కు చెందిన బస్సు లోయలో పడి, ఐదుగురు మృతిచెందగా, 20 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులంతా ప్రస్తుతం సర్కాఘాట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నదని తెలుస్తోంది. ఈ దుర్ఘటన హిమాచల్‌లోని మండీకి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న సర్కాఘాట్ సబ్-డివిజన్‌లోని మాసెరాన్ సమీపంలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై హిమాచల్ ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు విచారం వ్యక్తం చేశారు. హెచ్‌ఆర్‌టీసీ బస్సు లోయలో పడిపోవడం హృదయ విదారకమైనదని ఆయన పేర్కొన్నారు. బాధితులకు వెంటనే వైద్యసాయం అందించాలని తాను అధికారులను ఆదేశించానని ఆయన తెలిపారు. 'ఈ దుఃఖ సమయంలో, మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని సుఖ్‌విందర్ సింగ్ సుఖు'ఎక్స్' పోస్టులో తెలిపారు. పోలీసులు, స్థానిక అధికార యంత్రాంగం రిలీఫ్ ఆపరేషన్లలో చురుకుగా పాల్గొంది.

## అనారోగ్య బాధితులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

స్వర్ణసాగరం, వాకాడు :



వివిధ కారణాలతో బాధపడుతున్న అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వాకాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దువ్వూరు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యం లో గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాసిం సునీల్ కుమార్ గురువారం చెక్కులు పంపిణీ చేశారు. మండల పరిధిలోని తూపిలి పాలెం గ్రామానికి చెందిన షేక్ షకీలకు రూ. 25,541/, రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఈదురు అనిత కు రూ.73,889/ చెక్కులను వారు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు గూడూరు ఎమ్మెల్యేకు, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు

# మద్యం స్కామ్ వెనుక ఉన్న కుట్ర కోణాలు వెలికి తీయాలి

**విజయవాడ :** గత ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం వెనుక దాగి ఉన్న కుట్రలు పూర్తిగా వెలికి తీయాలని కూటమి ప్రభుత్వాన్ని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. విజయవాడలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విలేకర్లతో మాట్లాడుతూ మద్యం కుంభకోణంపై స్పందించారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ క్రమంలో మద్యం కుంభకోణంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)పైనా విమర్శలు గుప్పించారు. సిట్ పద్దతి చూస్తే కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉందన్నారు షర్మిల. డిస్టలరీల వద్ద కమీషన్లు, బినామీలు, నగదు రవాణా అంశాలతోపాటు వైఎస్ జగన్‌కి నెలకు రూ.60కోట్లు అందేవని మాత్రమే సిట్ అధికారులు చెబుతున్నారన్నారు. దీంతో మద్యం కుంభకోణంలో తయారీ నుంచి చివర విక్రయాల వరకు అవినీతి జరిగిందనేది అర్థమవుతుందని స్పష్టం చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఈ డిజిటల్ యుగంలో సైతం కేవలం నగదు రూపంలో మద్యం విక్రయాలు జరిపారని చెప్పారు. కేవలం బ్లాక్ మనీ కోసమే డిజిటల్ పేమెంట్లను నిలిపి వేశారని షర్మిల ఆరోపించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా నాటి ప్రభుత్వం చేసిన ఆర్థిక నేరంగా ఈ మద్యం విక్రయాలను ఆమె అభివర్ణించారు. రూ.3,500కోట్ల మద్యం కుంభకోణం ఒక్కటే కాదు.. పన్నులు ఎగ్గొట్టాలనే క్యాష్ పరంగా ఈ విక్రయాలు జరిపారని విమర్శించారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తిగా విచారణ



జరగాలని డిమాండ్ చేశారు. చివరకు నాన్ డ్యూటీ పేమెంట్లు మొత్తం బ్లాక్‌లోనే జరిగాయని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని సీఎం చంద్రబాబును ఈ సందర్భంగా షర్మిల డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బ్రాండ్ లిక్కర్లను నిలిపివేసి చీప్ లిక్కర్ తయారీని ఎందుకు ప్రోత్సహించారని వైసీపీ అగ్రనేతను వైఎస్ షర్మిల సూటిగా ప్రశ్నించారు. ఇదంతా కుట్రలో భాగంగా జరిగిందన్నారు. గత ఐదేళ్లలో ముప్పై లక్షల మందికి కిడ్నీ సమస్యలు వచ్చాయని.. మరో ముప్పై వేల మందికి పైగా చీప్ లిక్కర్ కారణంగా చనిపోయారని చెప్పారు. కోట్లాది మంది ప్రజలు ఏదో ఒక రూపంలో అనారోగ్యం బారిన పడ్డారని విమర్శించారు. ఈ మొత్తం వ్యవహారంపై దృష్టి పెట్టాలని సిట్‌తోపాటు సీఎం చంద్రబాబుకు సూచించారు.

నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ఎంత అమ్మారో తేల్చాలన్నారు. డిజిటల్ పేమెంట్ ఆపడం వెనుకే అవినీతి ఉందన్నారు. వీటన్నింటికి వైఎస్ జగన్ సమాధానం చెప్పాలని ఈ విలేకర్ల సమావేశంలో నిలదీశారు. అసెంబ్లీ సమావేశాలకు వెళ్లి కేవలం క్యాష్ విధానం ఎందుకు అమలు చేశారో ప్రజలకు చెప్పాలని తన అన్న, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు సూచించారు. నాసి రకం బ్రాండ్‌లకు ఎందుకు అనుమతి ఇచ్చారో కూడా చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే ఈ మద్యం వ్యవహారంలో తనకు అనుకూలంగా ఉన్న అంశాలనే వైఎస్ జగన్ తరచూ చెబుతున్నారని చెప్పారు. రుషికొండను ఎందుకు తవ్వారో కూడా ఇంతవరకు వైఎస్ జగన్ సమాధానం చెప్పలేదన్నారు. వివేకా హత్యలో సాక్షి పత్రిక హార్ట్ ఎటాక్ అని ఎందుకు చెప్పిందో తెలియలేదన్నారు. జగన్ అసలు అంశాలను మరుగున పెట్టి.. మభ్యపెట్టి మాట్లాడటంలో దిట్ట అని వైఎస్ షర్మిల తెలిపారు. ఇక కాంగ్రెస్ పార్టీ ఎవరికీ బి టీమ్ కాదన్నారు. ప్రధాని మోదీకి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇంకా దత్త పుత్రుడుగానే ఉన్నారని వ్యంగ్యంగా అన్నారు. వైఎస్ఆర్ వ్యతిరేకించిన బీజేపీకి వైఎస్ జగన్ ఊడిగం చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అనేక ప్రాజెక్టులను అదానీకి వైఎస్ జగన్ అడ్డగోలుగా కట్టబెట్టారని గుర్తు చేశారు. బీజేపీకి వైఎస్ జగన్ ఎప్పటికీ దత్త పుత్రుడేనని వైఎస్ షర్మిల కుండబద్దలు కొట్టారు.

# అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటులో క్యూపీఐఏఐ భాగస్వామ్యం

**అమరావతి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమారవతి క్వాంటం వాలీ లో క్యూపిఐఏఐ భాగస్వామ్యం కానుంది. నేషనల్ క్వాంటం మిషన్‌లో భాగంగా దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటం వ్యాలీలో క్యూపీఐఏఐ కూడా భాగస్వామ్యం వహించనుంది. దీనిలో అధునాతన 8 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుకు క్యూపిఐఏఐ సంస్థ ముందుకు వచ్చింది. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ సంస్థ వ్యవస్థాపకులు నాగేంద్ర నాగరాజన్‌తో చర్చించారు. ప్రజల ప్రయోజనాల కోసం ఉపకరించే ఆవిష్కరణలు, అలాగే, విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిఎం అన్నారు. దీనితో పాటు అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి క్యూపిఐఏఐను కోరారు. తద్వారా విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు క్వాంటం అల్గారిథంలు, అప్లికేషన్‌లను రూపొందించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ రంగాల్లో క్వాంటం కంప్యూటింగ్ సేవలు రాష్ట్రంలో వివిధ పంటల సాగులో కచ్చితత్వం, తెగుళ్లకు సంబంధించిన అంశాలను అంచనా వేసేందుకు క్వాంటం కంప్యూటింగ్ ఉపకరించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అదే సమయంలో వ్యవసాయ



ఉత్పత్తి పెరిగేలా సూచనలు, సలహాలను సకాలంలో ఇవ్వటం ద్వారా రైతుల ఆదాయాలను మెరుగుపడేందుకు ఈ సాంకేతికత దోహద పడాలని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో నీటి వనరులను సమర్ధంగా నిర్వహించేందుకు వీలుగా క్వాంటం టెక్నాలజీని వాడాలన్నారు. వ్యాధుల నిర్ధారణ, మెడికల్ లాజిస్టిక్స్ తదితర అంశాల్లోనూ క్వాంటం సిమ్యులేషన్‌ను సమర్ధంగా వినియోగించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. యువతకు నైపుణ్యాలను కల్పించే అంశంలోనూ క్వాంటం టెక్నాలజీ సహకారాన్ని తీసుకునేలా ప్రభుత్వం యోచన చేస్తోంది. క్వాంటం లాంటి ఆధునిక సాంకేతికత ద్వారా సామాన్య ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితుల్ని మెరుగు పర్చేలా ప్రభుత్వం కార్యాచరణ చేస్తోంది. విద్య, పరిశోధన, ఇన్నోవేషన్ రంగాల్లో డీప్ టెక్ ద్వారా సమాజానికి విస్తత ప్రయోజనాలు కల్పించటమే లక్ష్యంగా క్యూపిఐఏఐ, నేషనల్ క్వాంటం మిషన్, అమరావతి క్వాంటం వ్యాలీ పనిచేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యేలు చెప్పింది

# వినాలి వీరమల్లు

**కాకినాడ :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ కోసం ఇరవై మంది ఎమ్మెల్యేలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారా? అంటే అవుననే అంటున్నారు. జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల్లో ఆ పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేలే ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కూడా సహకరించడం లేదు. టీడీపీ నేతలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రోటోకాల్ పాటించకుండానే కొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో జనసేన ఎమ్మెల్యేలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోవడం లేదని కొందరు అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలసి కూర్చుని మాట్లాడితేనే ఈ సమస్యకు తెరపడుతుందని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయం సాధించింది. పవన్ కల్యాణ్ విజయం సాధించిన పిఠాపురం నియోజకవర్గం మినహాయించి మిగిలిన ఇరవై జిల్లాల్లో కూటమి పార్టీలోని నేతలు జనసేన ఎమ్మెల్యేలకు సహకరించడం లేదు. పిఠాపురం నియోజకవర్గంలోనూ మాజీ ఎమ్మెల్యే వర్మ తన వర్గాన్ని ప్రత్యేకంగా చూస్తున్నారు. అక్కడ కూడా జనసేన, టీడీపీకి పడటం లేదు. పిఠాపురం నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక మిగిలిన నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉంటుందన్నది ఆలోచించాలని కోరుతున్నారు. నాగబాబుతో పాటు ఇతర నేతలు అక్కడకు వెళ్లినప్పుడు టీడీపీ కార్యకర్తలు చేసే నినాదాలు ఎలా ఉంటాయో వేరే చెప్పాల్సిన పనిలేదు. ఇక తాజాగా తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి. వివాదాల విషయంలో మాట్లాడాలి అంటే తాను డైరెక్ట్ గానే మాట్లాడతానని, అసలు ఇరవై ఒక్క జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తెలుసా? అని బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన కామెంట్స్ మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయాన్ని తాకాయి. అందర్నీ ఒకచోట కూర్చోబెట్టి చర్చ పెడితే డి అప్పుడు తెలుస్తుంది తమ బాధ ఏంటో అని ఆయన అన్నారు. కలసి ఉంటే అందరికీ మంచిదని, లేదంటే.. వచ్చే ఐదేళ్లు



అందరూ అడుక్కోవాల్సి వస్తుందని కూడా బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన హెచ్చరికలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి. కూటమి ధర్మం ప్రకారం అన్ని పార్టీలకు సమాన హక్కులు ఉండాలని కోరారు. మరొక వైపు జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాత్రం ఆగస్టు నెల నుంచి పార్టీ పటిష్టతపై దృష్టి పెడతానని తెలిపారు. పవన్ కల్యాణ్ మాత్రం కూటమిలోని మూడు పార్టీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. అయితే చంద్రబాబు, పవన్ కల్యాణ్ లు సమన్వయంతో పనిచేస్తే సరిపోదని, కింది స్థాయిలో సమన్వయం ఉండాలని జనసేన ఎమ్మెల్యేలు కోరుతున్నారు. నియోజకవర్గాల్లో తమ పరిస్థితిని తెలుసుకుంటే పవన్ కల్యాణ్ అలా మాట్లాడరని అంటున్నారు. మొత్తం మీద త్వరలోనే జనసేన ఎమ్మెల్యేలు పవన్ కల్యాణ్ కు తమ పరిస్థితులు వివరించి కూటమిలో పార్టీల సమన్వయానికి కృషి చేయాలని కోరేందుకు సిద్ధమయినట్లు సమాచారం.

తమ్ముడు... నిర్ణయం ఎప్పుడు

ఎమ్మెల్సీ నాగబాబుకు మంత్రి పదవిపై పవన్ కల్యాణ్ క్లారిటీ ఇచ్చారు. తానే మంత్రి పదవిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చేవిషయంపై ఇప్పటి వరకూ చర్చ అంటూ ఏమీ జరగలేదని తెలిపారు. అయితే ఒక విషయం మాత్రం పవన్ కల్యాణ్ చెప్పారు. చంద్రబాబు నాయుడు తీసుకోవాల్సిన నిర్ణయం తీసుకున్నారని, కానీ తాను మాత్రమే దీనిపై ఆలోచిస్తున్నానని చెప్పడంతో పవన్ కల్యాణ్ నిర్ణయం వవల్లనే నాగబాబుకు మంత్రి పదవి ఆగిందని అనుకోవాలి. రాజకీయాల్లో ఉన్నప్పుడు కొన్నిసార్లు ఇబ్బందులు తప్పవన్నకల్యాణ్ ఆగస్టులో పదవుల విస్తరణపై తుది నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. పవన్ కల్యాణ్ తాజా వ్యాఖ్యలు వింటే నాగబాబుకు మంత్రి పదవి దక్కే అవకాశం కనిపించడం లేదు. కుటుంబంలోని వారికే పదవులు ఇస్తున్నారని, ఒకే సామాజికవర్గానికి పదవులను పంచుతున్నారన్న అపప్రధను తాను ఎదుర్కొనాల్సి వస్తుందని పవన్ కల్యాణ్ నాగబాబుకు మంత్రి పదవి విషయంలో ఆలోచిస్తున్నట్లు కనపడుతుంది. ఇప్పటికే జనసేనకు చెందిన ముగ్గురు మంత్రులుంటే అందులో ఇద్దరు కాపు సామాజికవర్గానికి చెందిన వారే. శాసనమండలిలో ఉన్న ఇద్దరు కూడా కాపు సామాజికవర్గానికి చెందిన వారే. ఇక మరో మంత్రి పదవి కూడా కాపు సామాజికవర్గానికి ఇస్తే తనపై కుల ముద్ర పడుతుందేమోనని పవన్ కల్యాణ్ భయపడుతున్నట్లు తెలిసింది.... అందుకే చంద్రబాబు నాయుడు నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని మీడియా సమావేశంలో ప్రకటించి ఇన్ని నెలలు అవుతున్నా జనసేనాని వెనక్కు తగ్గినట్లు తెలిసింది. నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చినందున పార్టీకి అదనంగా లభించే రాజకీయ ప్రయోజనం కూడా ఏమీ లేదని కూడా అంటున్నారు. ఎందుకంటే నాగబాబు కూడా ఫుల్ టైం పొలిటీషియన్ కాదు. ఏపీలో స్థిర నివాసం ఉండరు. ఇవన్నీ ఆలోచించి ఆయనకు ఇవ్వడం కంటే మరొక వ్యక్తికి పదవి ఇస్తే పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం అవుతుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నట్లు కనపడుతుంది. నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చినా యాక్టివ్ గా లేకపోయినా, సరిగా పనితీరు కనపర్చకపోయినా తాను మాట పడాల్సి వస్తుందేమోనని వెనక్కు తగ్గినట్లు కనపడుతుంది. మొత్తం మీద ఏపీ కేబినెట్ లో ఖాళీగా ఉన్న ఒక్క పోస్టు వచ్చే నెలలో భర్తీ అవుతుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# రూ.79,900 కోట్ల పెట్టుబడులకు ఓకే

-మొదటిపేజీ తరువాయి

ఎస్ఐపీబీ సిఫారసుల మేరకు సిఫీ సంస్థకు విశాఖ మధురవాడ ఐటీ హిల్స్‌లో 3.6 ఎకరాల భూమిని ఎకరా రూ.కోటి చొప్పున కేటాయించేందుకు మంత్రివర్గం సమ్మతించినట్లు తెలిపారు. ఇక్కడి ఐటీ టవర్స్‌లో సత్వ కంపెనీకి ఎకరా రూ.కోటిన్నర చొప్పున 30 ఎకరాలు.. ఏఎన్ఎసఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు హిల్స్ నంబర్3లో రెండున్నర ఎకరాలు ఒక చోట, 7.79 ఎకరాలు మరోచోట కేటాయించడానికి అంగీకరించింది.

బీవీఎం సంస్థకు ఎకరా రూ.కోటిన్నర చొప్పున ఐటీ పనోరమా హిల్స్‌లో 30 ఎకరాలు ఇవ్వడానికి ఆమోదం తెలిపింది. ఫెనమ్ పీపుల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎకరా రూ.4.05 కోట్ల చొప్పున.. మధురవాడలో ప్లాట్ నంబర్ సీ1ఏ, హిల్స్ నంబర్ 2లో 0.45 ఎకరాలు, రుషికొండ ఐటీ పార్కులోని హిల్స్ నంబర్4లో ప్లాట్ నంబర్ 15బీ, 15సీలో నాలుగు ఎకరాలు ఏపీఐఐసీ ద్వారా అప్పగించాలని నిర్ణయించింది. ఫెనమ్ పీపుల్ రూ.207.5 కోట్ల పెట్టుబడి పెట్టి 2,500 మందికి ఉపాధి కల్పించనుంది. బర్లీ పొగాకు రైతులందరినీ ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయాలని ఇదివరకే నిర్ణయించగా.. రైతుల నుంచి గరిష్ఠంగా 20 క్వింటాళ్ల చొప్పున కొనాలని ఇప్పుడు నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. తిరుపతి తొక్కిసలాట ఘటనపై జస్టిస్ సత్యనారాయణమూర్తి కమిషన్ సమర్పించిన నివేదికను ఆమోదించినట్లు చెప్పారు. ఈ కేసులో బాధ్యులైన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని దేవదాయ మంత్రిని సీఎం ఆదేశించారని తెలిపారు.

మరిన్ని నిర్ణయాలు..

**అనకాపల్లిలో గృహనిర్మాణానికి 58.18 ఎకరాలను భూసమీకరణ ద్వారా తీసుకునేందుకు అంగీకారం.**

**1,944.19 ఎకరాల భూమిని విశాఖ మెట్రోపాలిటన్ కమిషనర్ ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించేందుకు ఓకే.**

**ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టమెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ఆర్థిక సహకారంతో రాష్ట్ర మంచినీటి సరఫరా, మురుగునీటి యాజమాన్య విధానం కింద 20 ప్రాజెక్టులు చేపట్టేందుకు ఆమోదం.**

**ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్స్ కింద టౌన్‌షిపలు, ఎంఐజీ గృహాల నిర్మాణాలకు ఓకే. మారిటైమ్ బోర్డు ద్వారా రూ.5,526కోట్ల బాండ్ల విడుదలకు ఆమోదం.**

**విజయనగరం జిల్లా అరసాడలో పీవీఎస్ గ్రూప్ ద్వారా కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు.**

**అంతర్రాష్ట్ర వివాదాల కారణంగా నిలిచిపోయిన 1,200 మెగావాట్ల కురుకుట్టి పంప్ట్ స్టోరేజీ ప్లాంట్, కర్రివలస 1,000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల కేటాయింపులు రద్దు.**

**నంద్యాల జిల్లాలో ఆర్వీఆర్ ప్రాజెక్టు స్థాపించే 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రతిపాదనలకు ఆమోదం.**

**శ్రీకాకుళం జిల్లా సంతకవిటిలో పీవీఎస్ రామ్మోహన్ ఇండస్ట్రీస్ ద్వారా 1.5 టీపీడీ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ స్థాపన.**

**కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 300 మెగావాట్ల విండ్ పవర్ ఉత్పత్తికి రెన్యూ వ్యోమన్ పవర్‌కు గ్రీన్‌సిగ్నల్. డోన్ ప్రాంతంలో 600 మెగావాట్ల ప్రాజెక్టు స్థాపనకు రెన్యూ విక్రమ్ శక్తికి అనుమతి. కర్నూలు జిల్లా గుండుతెండ వద్ద శ్రీజా ఇన్‌ఫ్రా ప్రతిపాదనలు రద్దు.**

**జూ కేంద్ర పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రాష్ట్ర పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ తీసుకునే రూ.2,724 రుణానికి ప్రభుత్వ గ్యారెంటీ.**

**అనంతపురం జిల్లాలో 'ఆరో' ఇన్‌ఫ్రా (గతంలో అరబిందో రియాల్టీ)కి కేటాయించిన 500 మెగావాట్ల సింగనమల పీఎస్పీ అనుమతులు రద్దు.**

**కడప జిల్లా జమ్మలమడుగులో 1,050 మెగావాట్లు, శ్రీసత్యసాయి జిల్లా సున్నపురాయిపల్లెలో 400 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను జేఎసడబ్ల్యు సంస్థ స్థాపించేందుకు ఆమోదం.**

**అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్‌కు ఆమోద ముద్ర.**

**రాష్ట్ర నూర్‌బాషా/దూదేకుల ఆర్థిక సహకార సంస్థ ఏర్పాటుకు ఓకే.**

**తల్లికి వందనం పథకం అమలుకు ఆమోదం.**

**నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని శ్రీ నరసింహరాయ సాగర్ ప్రాజెక్టు (గోరకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు) రక్షణ చర్యల కోసం రూ.53 కోట్లతో పనులు చేపట్టేందుకు ఆమోదం.**

**విశాఖ జిల్లా గోలుగొండ మండలంలోని తాండవ రిజర్వాయరు ఆధునికీకరణ పనుల బాధ్యతల నుంచి మాక్స్ ఇండియా ఇన్‌ఫ్రా తొలగింపు.**

**గండికోట ఎత్తిపోతల పథకం స్టేజ్-1, స్టేజ్-2 పంప్ హౌస్‌ల నిర్వహణ బాధ్యత మేఘా ఇంజనీరింగ్‌కు అప్పగింత**

**ఎల్ఆర్ఎస్ పథకానికి సవరణ**

**జూన్ 30కి ముందున్నవాటికి క్రమబద్ధీకరణ**

ఆంధ్రప్రదేశ్ రెగ్యులరైజేషన్ ఆఫ్ అన్ అప్రూవ్డ్ లేఅవుట్స్ అండ్ ప్లాట్స్ రూల్స్ 2020(ఎల్ఆర్ఎస-2020)కి సవరణలు చేస్తూ మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. 2019 ఆగస్టు 30కు ముందు ఆమోదం పొందని ప్లాట్స్ సబ్‌డివిజన్లు, లేఅవుట్లు, వెంచర్లను క్రమబద్ధీకరించేందుకు 2020జనవరి 8న మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. దరఖాస్తుల స్వీకరణకు 2020 డిసెంబరు 31 వరకు గడువిచ్చారు. వాటి పరిష్కార గడువును 2025 జూలై 8 దాకా పొడిగించారు. అనధికార లే అవుట్ల వల్ల ప్రభుత్వం ఆదాయం కోల్పోయిందని, పలువురు అవగాహన లేక దరఖాస్తు చేసుకోలేక పోయారని డీటీసీపీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. తాజా సవరణతో లేఅవుట్లు సబ్‌డివిజన్ క్లియర్ కావడంతోపాటు ప్లాట్లు, రోడ్లకు సరిహద్దులు ఏర్పడతాయి. సవరణ రూల్స్ వచ్చిన 90 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరిస్తారు. 2025 జూన్ 30 వరకు ఉన్న లే అవుట్లను క్రమబద్ధీకరిస్తారు.

## మంత్రివర్గ ప్రక్షాళన?

-మొదటిపేజీ తరువాయి

చేసినట్లు ప్రచారం ప్రారంభం అయ్యింది.ప్రస్తుతం ఏపీ మంత్రివర్గంలో 24 మంది మంత్రులు ఉన్నారు. జనసేననుంచి ముగ్గురు, బిజెపి నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక మంత్రి పదవి ఖాళీగా ఉంది. అయితే చాలామంది మంత్రుల విషయంలో సీఎం అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. క్యాబినెట్లో మంత్రులుగా ఉన్న పదిమంది తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన వారే. అయితే వారి ఎంపిక సమయంలోనే కీలక సూచనలు చేశారు. అత్యవసరం అయితే మంత్రివర్గ విస్తరణ చేపడతామని.. ఆ సమయంలో పదవులు వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు సీఎం చంద్రబాబు. అందుకే ఇప్పుడు ఎనిమిది మంది మంత్రులకు ఉద్వాసన పలుకుతారని తాజాగా ప్రచారం ప్రారంభం అయ్యింది.మరోవైపు మెగా బ్రదర్ నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకోవడం తప్పనిసరి. ఈ విషయంలో పవన్ కళ్యాణ్ నిర్ణయమే ఫైనల్. మరోవైపు ఇప్పుడున్న మంత్రి పదవికి తోడు మరో పదవి బిజెపి కి కేటాయిస్తారని ప్రచారం సాగుతోంది. ఒకవైపు మిత్రపక్షాలకు ప్రాధాన్యం పెంచుతూ.. పార్టీలో సీనియర్లను క్యాబినెట్లోకి తీసుకోవాలని చంద్రబాబు కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఆగస్టు 15లోగా ప్రక్షాళన ఉంటుందని సమాచారం. అదే జరిగితే టిడిపిలో సీనియర్లు ఎవరెవరికి మంత్రి పదవులు దక్కుతాయి? బిజెపిలో ఛాన్స్ ఎవరికి అనే చర్చ ప్రారంభం అయింది.మరోవైపు ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజును( మంత్రివర్గంలోకి తీసుకుంటారని తెలుస్తోంది. అదే జరిగితే రఘురామ కృష్ణంరాజు స్థానంలో సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని డిప్యూటీ స్పీకర్ చేస్తారని సమాచారం. జనసేన నుంచి మంత్రిగా ఉన్న కందుల దుర్గేష్ ను తప్పించి కొణతాల రామకృష్ణకు అవకాశం ఇస్తారని తెలుస్తోంది. ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురు మంత్రులను తప్పించడం ఖాయమని తెలుస్తోంది. అదే జరిగితే పల్లా శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, కళా వెంకట్రావుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. గోదావరి జిల్లాలకు చెందిన వాసంశెట్టి సుభాష్ ను తప్పించే అవకాశం ఉందని కూడా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం నెల్లూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిని తప్పించి వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డిని క్యాబినెట్ లోకి తీసుకుంటారని సమాచారం.రాయలసీమ నుంచి సైతం చేర్పులు మార్పులు ఉండే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఓ మంత్రిని తప్పించి ఆ స్థానంలో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి సోదరుడు కిషోర్ కుమార్ రెడ్డికి ఛాన్స్ ఇస్తారని ప్రచారం సాగుతోంది. ఇక కృష్ణాజిల్లా నుంచి ఒక మంత్రిపై వేటు వేస్తారని తెలుస్తోంది. అయితే సామాజిక, ప్రాంతీయ సమీకరణలకు అనుగుణంగా తుది నిర్ణయాలు జరగనున్నాయి. అన్ని సమీకరణలను ప్రామాణికంగా తీసుకుని చేర్పులు మార్పులు ఉంటాయని

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# అభిమానం అంటే ఇలా ఉంటుందా : హరహర వీరమల్లు సినిమాకు దిష్టి తీస్తున్న జనసేన నాయకులు

స్వర్ణసాగరం, వెంకటగిరి,జూలై:24

వెంకటగిరి పట్టణం భ్రమరాంబ థియేటర్ వద్ద హరి హర వీరమల్లు మూవీ రిలీజ్ సందర్భంగా జనసేన పట్టణ అధ్యక్షుడు అనిల్ రామారావు ఆద్వర్యంలో సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా థియేటర్ వద్ద టపాసులు పేల్చి, పవన్ కళ్యాణ్ కి ఉమ్మడికాయలతో దిష్టి తీసి, అభిమానులు అందరూ కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా జనసేన పట్టణ అధ్యక్షుడు అనిల్ రామారావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సినిమా అంటే అభిమానులకే కాదు, బాక్సాఫీస్ అదో పెద్ద పండగ.




అందుకే ఆ పండగ ఎప్పుడెప్పుడు వస్తుందా? అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తారు. సుదీర్ఘ విరామం తర్వాత పవన్కల్యాణ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'హరి హర వీరమల్లు'. పవన్ కళ్యాణ్ కెరీర్లో నటిస్తున్న తొలి పీరియాడిక్ మూవీ కావడం, ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా జాయింట్ సెక్రెటరీ శ్రీ అరవ రాజేష్, జనసేన జిల్లా కార్యదర్శి శ్రీ చామండి రాధమ్మ, కోన రవిశంకర్ ,ఎద్దు రామ్మోహన్, కేశం శెట్టి వెంకటేశ్వరరావు, కుమార్, వీర మహిళ ఉష ,లత , నీటి సంఘం డైరెక్టర్ శీను తదితరులు పాల్గొన్నారు

# బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు







## కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్ రెడ్డి

కనిగిరి స్వర్ణ సాగరం జూలై 24

బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలకు ముంగిపు పలుదాం అనే నినాదంతో బాల్యవివాహాలు లేని జిల్లాగా రూపుదిద్దడం కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కనిగిరి ఆర్ డి ఓ కేశవర్ధన రెడ్డి పిలుపునిచ్చారు.మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గురువారం కనిగిరి పట్టణంలోని ఆర్ డి ఓ కార్యాలయం ప్రాంగణంలో బంగారు బాల్యం కమిటీ, సార్డ్ సంస్థ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు -బాలల అక్రమ రవాణా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ డి ఓ మాట్లాడుతూ బాల్యవివాహాలను చేసిన, ప్రోత్సహించిన వారికి రెండేళ్ల జైలు,రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందన్నారు.పిల్ల ల అక్రమంగా రవాణా చేయడం అనేది తీవ్రమైన నేరం, ఇది వారి శారీరక,మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ అన్నారు.అలాగే, పిల్లలకు వారి హక్కుల గురించి అవగాహన కల్పించాలని బాలల అక్రమ రవాణా లాంటి నేరాలను నిరోధించడానికి, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలందరూ కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు.కనిగిరి ఎం ఆర్ ఓ ఎ వి రవి శంకర్ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నా, బాలల అక్రమ రవాణా జరుగుతున్నట్లు అనుమానం వచ్చినా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లు 1098,100,112 కు కాల్ చేయాలని అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమంలో పిల్లి రమణా రెడ్డి, ఏరువారి పల్లి సర్పంచ్ దమ్ము వెంకటయ్య, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు,జి ఎస్ అండ్ జి డి కె ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవకుమార్,సార్డ్ ప్రతినిధులు ఎలీషా, పవన్,కూటమి నాయకులు తమ్మినేని శ్రీనివాస రెడ్డి,కృష్ణన్ వెంకట రెడ్డి, బారాయిమం,యడవల్లి మనోజ్,రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

# దొరువు ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం





## మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి స్వర్ణ సాగరం జూలై 24

కనిగిరి పట్టణంలోని దొరువు ప్రాంతం ఎన్ ఏ పి వాటర్ వద్ద నీటి కుళాయి కేజీల ద్వారా సాగర్ నీరు వృధాగా పోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు.దొరువు ప్రాంతంలోని స్థానిక ప్రజలు ఫిర్యాదు మేరకు చైర్మన్ అబ్దుల్ గఫార్ పర్యటించి సాగర్ నీరు వచ్చే కుళాయిలు లేకేజిలు, పైపులు పగిలి పోవడం ప్లాట్ పగిలి పోవడం మొదలగు సమస్యలును స్థానిక ప్రజలు నుండి ఆయన అడిగి తెలుసుకొని త్వరిత గతిన సమస్యలను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడి దొరువు ప్రాంతంలోని సాగర్ నీరు వృధా కాకుండా పాత కుళాయిల పాత దిమ్మెలను తొలగించి వాటి స్థానంలో కొత్త కుళాయిలు దిమ్మెలు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి పరిస్థితుల్లో కూడా ఇబ్బందికరంగా లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు చైర్మన్ ఆదేశించి చర్యలకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని సమస్యలు మా దృష్టికి వస్తే వెంటనే పరిష్కరించేందుకు అన్ని విధములగా సిద్ధంగా ఉన్నామని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.ఈ కార్యక్రమంలో విజేత కాలేజీ యాజమాన్యం పసుపులేటి అరునోధర్ పారిశుద్ధ్య కార్యదర్శి ప్రసాద్ రెడ్డి స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చడంలో విఫలం -హామీలు అమలయ్యే వరకూ పోరాడుదాం.



## వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి స్వర్ణ సాగరం జూలై 24

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్దామని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పార్టీ నాయకులకు, కార్యకర్తలుకు పిలుపునిచ్చారు. హనుమంతునిపాడు మండల కేంద్రంలో గురువారం మండల పార్టీ అధ్యక్షులు యక్కంటి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో "బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ"కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గడపకూ వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేద్దామన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను నిలువునా ముంచారని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు,సోషల్ మీడియా సభ్యులను టార్గెట్ చేస్తూ దౌర్జన్యాలు,అరాచకాలు చేస్తున్నారని విమర్శించారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారన్నారు.మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత ఆయనదేనన్నారు. ప్రజలను మోసగించటం చంద్రబాబుకు అలవాటేనన్నారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డిఆధ్వర్యంలో పోరాటాలు చేస్తుంటామని దద్దాల నారాయణ యాదవ్ స్పష్టం చేశారు.పార్టీ నాయకులకు,కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటానని ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ భరోసా ఇచ్చారు.అనంతరం "బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ " సంబందించిన స్కానర్ పోస్టరును విడుదల చేశారు.ఈ కార్యక్రమలో యక్కంటి శ్రీనివాసుల రెడ్డి,గాయం బలరామిరెడ్డి,గాయం సావిత్రి ,గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, మద్ది తిరుపతయ్య, వేశపోగు గురు ప్రసాద్,సుందర్ యహోషువ,వనుకూరి రామిరెడ్డి, మోరబోయిన పెద మాలకొండయ్య , సురేష్ , మరియబాబు, మాలపాటి రామిరెడ్డి, సంతోష్ కుమార్, భూతపాటి దేవయ్య, వెంకట రామయ్య, గూడూరి విజయ్, బలసాని యెహోషువ, మోటు తదితరులు పాల్గొన్నారు.

# డోర్నకల్ లో ఘనంగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు



స్వర్ణ సాగరం డోర్నకల్ జులై 24

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను డోర్నకల్ పట్టణం లో బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీ కూడలిలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్లు, పండ్లను పంచి పెట్టారు. కార్యక్రమంలో జిల్లా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, మాజీ కౌన్సిలర్లు శరత్, పోటు జనార్దన్, హేమచంద్రశేఖర్, నాయకులు కొత్త వీరన్న, యశోదర్ జైన్, మధు,మారబోయిన రాంభద్రం, శ్రీనివాస్,గౌస్, కృష్ణ, దాసరి శ్రీను,పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# రామచంద్రపురంలో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

## - ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కార్యాచరణ,



స్వర్ణ సాగరం తొట్టంబేడు,

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలంలోని రామచంద్రపురం గ్రామ ప్రజలు ఎన్నాళ్లుగా ఎదుర్కొంటున్న వోల్టేజ్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గ్రామస్తులు ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి కి తెలియజేయగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత విద్యుత్ అధికారులకు తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు.ఈ మేరకు జూలై 24న గురువారం విద్యుత్ శాఖ ఏడీఈ సుధాకర్ మరియు ఏఈ బాలాజీ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి 100 కేవీఏ విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ ను రామచంద్రపురం గ్రామంలో ఏర్పాటు చేశారు.ట్రాన్స్ఫర్మర్ ప్రారంభోత్సవాన్ని బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి పూజ నిర్వహించి ప్రారంభించారు.గతంలో ఈ గ్రామానికి అగ్రికల్చర్ ట్రాన్స్ఫర్మర్ నుంచే విద్యుత్ సరఫరా అందించబడేది. ఈ ట్రాన్స్ఫర్మర్ వల్ల తక్కువ వోల్టేజ్ కారణంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు కొత్త ట్రాన్స్ఫర్మర్ తో గ్రామానికి 24 గంటల త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందుబాటులోకి రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజా నాయుడు, సరోజమ్మ, కొన్నలి రమేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బదిలీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి.




## మున్సిపల్ కార్యాలయం వద్ద తెల్లవారుజామున ఆందోళన

కనిగిరి స్వర్ణ సాగరం జూలై 24

కనిగిరి మున్సిపాలిటీలో పని చేస్తున్న బదిలీ పారిశుద్ధ కార్మికులను గురువారం విధులలోకి తీసుకోకపోవడంతో సిఐటియు జిల్లా నాయకులు పిసి కేశవరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులు కార్యాలయం గేటు వద్ద ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా సిఐటి జిల్లా నాయకులు పిసి కేశవరావు మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీలో సమ్మెలో పాల్గొన్న కారణంగా బదిలీ కార్మికులను విధులకు తీసుకోకుండా కక్ష సాధింపు చర్యలకు అధికారులు కొనుక్కోవడం దుర్మార్గమని అన్నారు. కనిగిరి పట్టణ జనాభా కు అనుగుణంగా సిబ్బందిని నియమించుకోకపోవడం దారుణం అన్నారు.75 మంది కార్మికులు ఉండగా 20 మంది పైగా విధులలో పాల్గొనకుండా కార్యాలయానికి పరిమితమై ఉంటున్నారని ఫలితంగా పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి అన్నారు. విధులకు హాజరుకాని పారిశుద్ధ కార్మికుల పేరుతో వేతనాలను డ్రా చేసుకుంటూ సానిటరీ ఇన్స్పెక్టర్ అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు.పిఎఫ్, ఈఎస్ఐ, సంక్రాంతి కానుక, దుస్తులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్నారన్నారు. చనిపోయిన పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలను ఆదుకునేలా వారి కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించడంలో జాప్యం వహిస్తున్నారని విమర్శించారు. మృతుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.అవినీతికి పాల్పడడం అధికారుల వంతు అయిందని అన్నారు. సానిటరీ ఇన్స్పెక్టర్ విధి నిర్వహణ తీరుపై విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరేంద్ర, చార్లెస్, లక్ష్మయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తోటపల్లి గూడూరు పంచాయతీలో డస్ట్ బిన్ లు పంపిణీ చేసిన టిడిపి నేతలు



తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం జూలై 24

తోటపల్లి గూడూరు గ్రామపంచాయతీలో గురువారం సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో టిడిపి నేతలు మన్నెం జితేంద్ర మన్నెం మధుసూదన్లుగ్రామపంచాయతీ పరిశుభ్రతను మెరుగుపరిచే క్రమంలో ఇంటింటికి తడి చెత్త పొడి చెత్త వేసుకునేందుకు వీలుగా డస్ట్ బిన్ లు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయితీలో పరిశుభ్రత పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వ ఆలోచనలకు దీటుగ డస్ట్ బిన్ లు ఇంటింటికీ సరఫరా చేసినట్లు వారు తెలిపారు. ప్రజలు ఈ విషయంలో సహకరించి తోటపల్లి గూడూరు పంచాయతీకి గుర్తింపు తేవాలని విజ్ఞప్తి చేశారు

# , త్రివేండ్రం ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్పోర్ట్ మహాసభలు జయప్రదం చేయాలి



## జిల్లా ఆటో కార్మిక ,సంఘం అధ్యక్ష కార్యదర్శులు కే సురేష్ మారిపోయిన రాజా విజ్ఞప్తి

నెల్లూరు స్వర్ణ సాగరం జూలై 24

అఖిలభారత రోడ్డు ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్రివేండ్రంలో జూలై 29, 30, 31 మూడు రోజులపాటు నిర్వహిస్తున్న మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కే సురేష్ మారుబోయిన రాజా విజ్ఞప్తి చేశారు, ట్రాన్స్పోర్ట్ రంగంలో 10 కోట్ల మంది డ్రైవర్లు గా ఉన్నారని వారి సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలని గ్రీన్ టాక్సు అధిక చలానాలు పెనాల్టీలకుసంబంధించిన జీవో నెంబర్ 21 రద్దు చేయాలన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న ప్రతి ఆటో డ్రైవర్ కు 15000 చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు వాహన మిత్ర పథకం ద్వారా ఇస్తానన్న రూ 15 వేల రూపాయలు తక్షణం మంజూరు చేయాలన్నారు. వోల్వా రాపిడ్ వంటి ప్రైవేట్ సంస్థల కారణంగా ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. ప్రభుత్వం కేరళ తరహాలో యాప్ ఏర్పాటు చేసి డ్రైవర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం సుధాకర్ రవీంద్ర స్వర్ణ బాబురావు నివాస్ అధిక సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు

# ఇసుక పాలెం లో పీఎంఆర్ కె వి వై శిక్షణా సమావేశం



తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం జూలై 24

ఇందుకూరుపేట సబ్ డివిజన్ టీపీ గూడూరు మండలం ఇసుక పాలెం రైతు సేవ కేంద్రం పరిధిలో శుక్రవారం జిల్లా వనరుల కేంద్రము నెల్లూరు వారి ఆధ్వర్యంలో పి ఎమ్ ఆర్ కె వి వై ప్రధానమంత్రి రాష్ట్ర కృషి వికాస్ యోజన శిక్షణనిర్వహించడం అయినది ఈ శిక్షణలో C. మారుతీ దేవి సహాయ వ్యవసాయ సంచాలకులు జిల్లా వనరుల కేంద్రము నెల్లూరు వారు సమతుల ఎరువుల వాడకము సమగ్ర పోషక యాజమాన్యం వివరించారు ఖరీఫ్ సీజన్లో ప్రధానంగా వరి పంటకు 105 కేజీల యూరియా మూడు దఫాలుగా మూడు సమభాగాలుగా దమ్ము చేసే సమయంలో నాట్లు వేసే సమయంలో పిలకలు కట్టే దశలో చిరు పొట్ట దశలో వేసుకోవాలని సూచించారు మోతాదుకు మించి వాడితే పురుగులు తెగుళ్ల ఉధృతి ఎక్కువై తద్వారా ఖర్చు పెరుగుతుందని తెలిపారు కిరణ్ కుమార్ రెడ్డి కెవికె శాస్త్రవేత్త నెల్లూరు జీవన ఎరువులు అజోల్ల అజోస్పైరిలం అజిటోబక్టర్ వాడకం గురించి రైతులకు వివరించారు ఈ జీవన ఎరువుల వాడకం వలన రసాయన ఎరువుల వినియోగం 20 నుంచి 25 శాతం తగ్గుతుందని తెలిపారు ఇఫ్కో మేనేజర్ లక్ష్మీ నారాయణ నానో యూరియా నానోడిఏపీ నానో జింక్ నానో కాపర్ వాడకంపై అవగాహన కల్పించారు.. మండల వ్యవసాయ అధికారి శిరీష రాణి ప్రస్తుతం వ్యవసాయ శాఖలోఅమలవుతున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మండలములోని రైతులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

# మోహన్ రెడ్డి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి అందుకున్నా కోమారి శ్రీనివాసులు





కోట స్వర్ణసాగరం జులై 24

కోట మండలం నెల్లూరుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కొమారి శ్రీనివాసులు తన చికిత్స కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 22,600 చెక్కున అందుకున్నారు.ఈ గురువారం గూడూరులోని క్యాంపు కార్యాలయంలో మండల నాయకులు నెల్లూరు మోహన్ రెడ్డి,షేక్ జలీల్ అహ్మద్,కొకర్ల మధు యాదవ్ చేతుల మీదుగా చెక్కును లబ్ధి దారునికి అందేజేశారు.ఈ సందర్భంగా కోమారి శ్రీనివాసులు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న నా లాంటి పేదవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవని లాంటిదని అన్నారు.నా ఆరోగ్య పరిస్తితి గమనించి చొరవ చూపిన నెల్లూరు మోహన్ రెడ్డి ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కృషి మరువలేనిదని అన్నారు.సునీల్ కుమార్ గతంలో శాసనసభ్యులుగా ఉన్నప్పుడు మానెల్లూరుపల్లి గ్రామంలో ఒక బీసీ సామాజిక వర్గానికి చెందిన సోదరుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు అన్ని విధాల సహాయం చేసి ప్రాణభిక్ష పెట్టాడని గుర్తుచేసుకున్నారు. పేదవారికి అండగా ఉంటూ సహాయ సహకారాలు అందజేస్తున్న శాసనసభ్యులు సునీల్ కుమార్ పదికాలాల పాటు చల్లగా ఉండాలని దీవించారు.తనకి సహకరించిన మండల పార్టీ నాయకులకు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యేగా 10 కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి తెచ్చిన పాశం సునీల్ కుమార్

కోట స్వర్ణసాగరం జులై 24

రెండు పర్యాయాల తన పదవీకాలంలో శాసనసభ్యుడుగా ఇప్పటివరకు పది కోట్ల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధిని నియోజకవర్గంలోని అనారోగ్య బాధ్యతలకు తెచ్చి ఇచ్చిన ఘనత డాక్టర్ పాశం సునీల్ కుమార్ కి దక్కిందని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి అందించే కార్యక్రమంలో భాగంగా గూడూరులోని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా కోట గ్రామానికి చెందిన కావేరి సుబ్బారెడ్డి కి 70 వేల రూపాయల తో పాటుగా నియోజకవర్గంలోని 20 మందికి 13 లక్షల 38వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా అందించిన క్రమంలో రాధాకృష్ణారెడ్డి కోటలో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో పాశం సునీల్ కుమార్ రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి ఏడాది కాలంలో 138 మందికి ఒక కోటి 37 లక్షల రూపాయల ఆర్థిక



సహాయం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరయ్యేలా చేశారన్నారు.గత 2016 లో వైకాపా నుండి నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ తెలుగుదేశం పార్టీలో చేరినప్పటి నుండి 2016 – 2019 మధ్య కేవలం మూడు సంవత్సరాల మధ్య కాలంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో నియోజకవర్గంలోని వేలాదిమంది అనారోగ్య బాధితులకు తొమ్మిది కోట్ల రూపాయల వరకు ముఖ్యమంత్రి సహాయ నిధిని మంజూరు చేయించి అండగా నిలిచారన్నారు.ఇప్పుడు మరలా 2024లో శాసనసభ్యుడుగా ఎన్నికైనప్పటినుండి నియోజకవర్గంలో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తూ ప్రగతి పథాన పయనింపచేస్తున్న డాక్టర్ పాశం సునీల్ కుమార్ ఈ ఏడాది కాలంలో నియోజకవర్గంలోని 138 మందికి ఒక కోటి 37 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించడమే కాక మరో వందమందికి కోటి రూపాయల వరకు ముఖ్య మంత్రి సహాయ నిధి కోసం ప్రతిపాదనలు పంపి ఉన్నారని తెలిపారు.ఈ విధంగా గతంలో ఎన్నడూ లేని విధంగా గూడూరు నియోజకవర్గంలోని అన్ని వర్గాల వారి ప్రయోజనాలను పరిరక్షిస్తూ నియోజకవర్గం లోని అర్హులైన అన్ని కులాల లోని అనారోగ్య బాధితులకు రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,నారా లోకేష్ బాబు, కొణిదల పవన్ కల్యాణ్ ల సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధిని మంజూరు చేయిస్తూ అండగా నిలుస్తున్న డాక్టర్ పాశం సునీల్ కుమార్ ను ఆశీర్వదించాలని నియోజకవర్గ ప్రజలకు రాధాక్రిష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# చెట్లను నాటుదాం పర్యావరణాన్నిపరిరక్షిద్దాం

స్వర్ణసాగరం,వెంకటగిరి,జూలై:24

స్థానిక వెంకటగిరి శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు గ్రీన్ ఇండియా మిషన్ లో భాగంగా పర్యావరణ పరిరక్షణ, చెట్లను నాటడం,పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన, అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ వివి రమణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మానవ మనుగడకు భవిష్యత్ తరాల జీవనానికి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యం అని మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెట్లను విరివిగా నాటాలని నాటిన చెట్లను మనమే పరిరక్షించాలని తద్వారా వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందని విద్యార్థులకు వివరించారు. తదనంతరం






పాఠశాల ప్రధానోపాధ్యాయులు జానా పరంధామయ్య మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం ప్రతినెల విద్యార్థులుకు సామాజిక అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈరోజు మన పాఠశాలలో చెట్లు నాటే కార్యక్రమం మరియు పరిశుభ్రత పై అవగాహన విద్యార్థులచే ర్యాలీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షించుకుంటే మానవ జీవనం ఆరోగ్యకరంగా ఉంటుందని ఈ సందర్భంగా విద్యార్థులకు తెలిపారు.

తదనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు.విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోవిద్యార్థిని, విద్యార్థులు డీన్ పెంచలరాజా, ఏవో రమణ, వ్యాయామ ఉపాధ్యాయుని, అర్భుదా నందిని తదితరులు పాల్గొన్నారు.

# విశ్వనరుడు గుర్రం జాషువాకు ఘన నివాళి



స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిక

ఆధునిక సాహిత్యంలో తన పదునైన రచనల ద్వారా సమాజంలోని దురాచారాలను ప్రశ్నించి ఆలోచింపజేసిన మహాకవి గుర్రం జాషువా అని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్షులు యువశ్రీ మురళి అన్నారు.గురువారం గుర్రం జాషువా వర్థంతి సందర్భంగా మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రార్థనా సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు వాణి గుర్రం జాషువా చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పుష్పాంజలి ఘటించారు.అనంతరం యువశ్రీ మురళి విద్యార్థులును ఉద్దేశించి మాట్లాడుతూ విశ్వమానవ సమానత్వం గురించి కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని మూఢాచారాలపై తిరుగుబాటుతో, అణగారిన ప్రజల ఆత్మగౌరవం కోసం పాటుబడిన నవయుగ కవి చక్రవర్తి జాషువా అని, తెలుగు వారికి ఎన్నో ఆణిముత్యాల్లాంటి రచనలను అందించి సమాజంలోని అసమానతలు, అంటరానితనంపై తన రచనల ద్వారా కలం, గళం విప్పిన కవి జాషువా అని కొనియాడారు.ఉపాధ్యాయులు సురేష్ బాబు, నాదెండ్ల మురళి, లక్ష్మయ్య, జగన్నాథం, మాధవీలత, సుజన, దాసు తదితరులు పాల్గొన్నారు.

# డోర్నకల్ మొన్నేరు వాగును పరిశీలించిన సిఐ బి.రాజేష్ నాయక్

## కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



స్వర్ణ సాగరం డోర్నకల్ జులై 24

గత మూడు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా డోర్నకల్ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ బి. రాజేష్ ,అన్నారు. గురువారం మండలంలోని మున్నేరు వాగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కుండపోతల కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుంచి బయటకి రావద్దన్నరు.ప్రమాద కారణాల దృష్ట్యా జలాశయాలు,చెరువులు, వాగులు, కుంటలు, చూడడానికి వెళ్లకూడదని, జలాశయాలు నిండుకుండల మారి ప్రమాదాలు జరగటానికి అవకాశం ఉంటుందన్నారు.మున్నేరు వాగు ప్రవాహం పెరుగుతుండడంతో చేపల వేటకు వెళ్లి ప్రాణాలు కోల్పోవద్దని చెప్పారు. అత్యవసర సమయంలో డయల్ 100, కి కాల్ చేయాలని సూచించారు. వారి వెంట ఏఎస్ఐ కోటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు

# స్వర్గీయ కరుటూరి సూర్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మహారాష్ట్ర ఎమ్మెల్యే ప్రశాంత్ రామ్ సెత్ ఠాగూర్ ఆదిరెడ్డి వాసు మద్దిపాటి వెంకటరాజు



దేవరపల్లి స్వర్ణ సాగరం

కరుటూరి ధనుంజయుడు ను పరామర్శించిన మహారాష్ట్రకు చెందిన ఎమ్మెల్యే ప్రశాంత్ రామ్ సెత్ ఠాగూర్ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ గోపాలపురం తెలుగుదేశం పార్టీ నాయకుడు వ్యాపారవేత్త కరుటూరి ధనుంజయుడు ను శ్రీరామ్ మూర్తిని పరామర్శించారు దుద్దుకూరు మాజీ సర్పంచ్ కరుటూరి సూర్యారావు ఇటీవల మృతి చెందారు ఈ సందర్భంగా స్వర్గీయ కరుటూరి సూర్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆండ్రు అనిల్, తెలుగుదేశం నాయకులు ఉప్పులూరు రామారావు,కంటిపూడి సుబ్బారావు, కె రవికుమార్, కొయ్యలమూడి తాతారావు, లంకా సత్యనారాయణ, పెనుమత్స సుబ్బరాజు, బల్ల సూరి చక్రం,ఆచంట శేషారావు, ముళ్ళపూడి దొరాజి చౌదరి, నందిగం శ్రీధర్,పెన్నమ్మని నవీన్, కడిమి సూర్యనారాయణ, ముళ్ళపూడి గంగాధరరావు, ముళ్ళపూడి సత్యనారాయణ, కంటిపూడి రాజేంద్ర, కొయ్యలమూడి తాతారావు, తదితరులు పాల్గొన్నారు

# శ్రీకాళహస్తిలో 54వ వారం అన్నదాన కార్యక్రమం





స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి పట్టణంలో పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో శ్రీమతి డొక్కా సీతమ్మ గారి అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది.శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆశయాలకు అనుగుణంగా, శ్రీకాళహస్తిలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో 54వ వారం శ్రీమతి డొక్కా సీతమ్మ గారి అన్నదాన కార్యక్రమం జరిగింది. పవన్ కళ్యాణ్ గారి ఆశయ సాధనకు కృషి చేస్తున్న జనసేన నాయకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమంలో శ్రీమతి డొక్కా సీతమ్మ గారితో పాటు, నిర్వాహకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, గంధం శ్రీను, నవీన్, ముని చంద్ర, చందు, సాయి, రాజా, ముని కుమార్, వీర మహిళలు బత్తెమ్మ, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గోన్న పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్

**గ్రామాల్లో గడప గడపకు వెళ్ళి ప్రజల యోగ క్షేమాలు తెలుసుకున్న ఎమ్మెల్యే**

**ఏడాది పాలన, సూపర్-6 అమలుపై ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే**

**సీఎం చంద్రబాబు నాయుడు పాలన దక్షతతో ఏడాదిలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు**

**ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే**



ఐరాల జులై 24 స్వర్ణ సాగరం

ఐరాల మండలం,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన దక్షతతో ఏడాది కాలంలోనే రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్.కలికిరి మురళీమోహన్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా గురువారం ఐరాల మండలం, కలికిరిపల్లె, ఇరువారంపల్లె, తెల్లగుండ్లపల్లె, పొలకల, నెల్లిమండపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే మురళీమోహన్ పర్యటించారు. అంతకముందు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూలమాలు, దుశ్శాలువతో సత్కరించగా, మహిళలు మంగళ హారతులతో అపూర్వ స్వాగతం పలికారు. ఇరువారంపల్లె గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండాను మండల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో గడప గడపకు వెళ్ళి ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకుని, ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను, అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ వాటికి సంబంది,o చిన కరపత్రాలను పంచుతూ ముందుకు సాగారు. గ్రామాల్లో వృద్దులు, వికలాంగులు, స్కూల్ పిల్లలను పలకరిస్తూ ముందు సాగారు. తెల్లగుండ్లపల్లె దళితవాడలో ఓ చిన్నారికి వినికిడి శక్తి లేక పోవడంతో ఆ చిన్నారి సమస్యలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్న ఆయన, టిటిడి శ్రవణంకు సిఫార్సు చేసారు. ఆ చిన్నారికి ఆరోగ్య రిత్య ఎటువంటి సహాయం కావాలన్నా తాను అందించేందుకు సిద్ధం అని హామీ ఇచ్చారు. కూటమి పాలనలో వివక్ష లేకుండా పథకాలు అందుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల వద్దకే పాలన తీసుకొస్తూ ఇంటింటికి వెళ్ళి ప్రజలు సమస్యలు తెలుసుకుంటూ వారి సమస్యలు తీర్చాలనే లక్ష్యంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని, సూపర్‌సిక్స్ కార్యక్రమాల్లో భాగంగా సామాజిక పింఛన్లు పెంపుదల, తల్లికి వందనం కార్యక్రమాలను అమలు చేసినట్లు తెలిపారు. ఉచిత గ్యాస్ పంపిణీ చేపట్టామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఆగస్టు 15న ప్రారంభమవుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, పూతలపట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ కో-ఆర్డినేటర్ గిరిధర్ బాబు, ఐరాల జెడ్పీటీసీ సుచిత్ర కన్నయ్య నాయుడు, ఐరాల సింబల్ విండో చైర్మన్ శేషాద్రి నాయుడు, పూర్ణచంద్రరావు,కానిపాకం ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, నాంపల్లి సర్పంచ్ స్వర్ణ, ఎమ్మార్వో, ఎంపీడీవో, ఐరాల ఎస్సై , ఏపీవో, వైద్య అధికారి రెడ్డమ్మ, మరియు మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గోన్నారు.

# సాయినాథునికి ప్రత్యేక పూజలు

**ఉభయకర్తలుగా మందిర నిర్మాణ కర్తలుగా**

**హైదరాబాద్ వాస్తవ్యులు సుకన్య దంపతులు**

**350 మంది భక్తులకు అన్నదానం**



స్వర్ణ సాగరం ఓజిలి జూన్ 24:

మండల పరిధిలోని మానమాల సాయిబాబా మందిరంలో మందిర నిర్మాణ కర్తలు ఉచ్చూరు హరనాథ్ రెడ్డి, శోభారాణి దంపతులు సాయిబాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కాగడ హారతి సాయినాథుని మేల్కొల్పి కాకడా హారతి తో పూజలను ప్రారంభించారు. ఆలయ నిర్మాణకర్తలు కట్టా విష్ణువర్ధన్ రెడ్డి, సాయి సుజన రెడ్డి గోత్రనామాలపై పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సాయిబాబా కు అభిషేకాలు హారతులు ఇచ్చి వినాయకస్వామి, దత్తాత్రేయ స్వామి, శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయినాథుని పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హైదరాబాద్ వాస్తవ్యులు సుకన్య దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించి 350 మంది భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. సాయంత్రం ధూప్ హారతి తో సాయినాథునికి పూజలు చేశారు. రాత్రి పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సేజ్ హారతి నిర్వహించి భక్తులకు సాయిబాబా దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

# రేయిన్‌బో ఈ-స్మార్ట్ స్కూల్ విద్యార్థుల విశిష్ట విజయాలు

రేణిగుంట స్వర్ణ సాగరం జూలై 24



రాష్ట్ర స్థాయిలో 2025 జూలై 17 నుంచి 22వ తేదీ వరకు ఘనంగా నిర్వహించబడిన స్పేస్ వీక్ – 2025 కార్యక్రమాల్నీ రెయిన్ బో గ్రూప్ ఆ స్కూల్స్ విద్యార్థులు పలు విభిన్న పోటీల్లో అసాధారణ ప్రతిభను ప్రదర్శించి పాఠశాలల ఖ్యాతిని మరింత పెంచారు. ఎలొక్యూషన్ పోటీ (జూలై 22, 2025) 69 పాఠశాలల మధ్య నిర్వహించబడిన వక్తృత్వ పోటీలో, కమలిని అనే విద్యార్థిని రెయిన్‌బో స్కూల్ తరఫున పాల్గొని 2వ బహుమతి అందుకోవడం గర్వించదగిన విషయం. పోస్టర్ పెయింటింగ్ పోటీలు సీనియర్ కేటగిరీలో నిర్వహించిన పోటీలో, టి.చరిత విద్యార్థిని 2వ బహుమతి సాధించింది. జూనియర్ కేటగిరీలో: దివ్యసాగర్ (గ్రేడ్ 5) ప్రత్యేక బహుమతిని పొందింది. అలాగే కిడ్స్ లెవెల్ పోటీలో: ఆర్. లీనశ్రీ (గ్రేడ్ 4) కన్సోలేషన్ బహుమతిని అందుకుంది. అంతర్జాతీయ టీంవైజ్ సైన్స్ క్విజ్ పోటీ (జూలై 19, 2025)

స్పేస్ అండ్ ఆస్ట్రానమీ అనే అంశంపై 79 పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీలో, రాత పరీక్ష ఫలితాల ఆధారంగా ఉత్తమ 6 పాఠశాలలను ఎంపిక చేయగా, రెయిన్‌బో విద్యార్థులు 5వ మరియు 6 వ స్థానాలలో నిలిచారు. ఈ విజయం విద్యార్థుల శాస్త్రీయ అవగాహనకు నిదర్శనంగా నిలిచింది. ఓపెన్ హౌస్ స్పేస్ సైన్స్ క్విజ్ పోటీ (జూలై 21, 2025)ఈ పోటీలో రెయిన్‌బో పాఠశాల నుండి 16 మంది విద్యార్థులు పాల్గొనగా, అందరూ కూడా బహుమతులు సాధించడం విశేషం. ఈ విజయాలు మా పాఠశాల విద్యార్థుల నైపుణ్యం, కృషి మరియు మార్గనిర్దేశనకు ప్రతిబింబం. భవిష్యత్తు శాస్త్రవేత్తలు, కళాకారులు, నాయకులు మా పాఠశాల గూటిలో ఎదుగుతున్నారు అనే విషయాన్ని ఈ విజయం మరోసారి రుజువు చేసింది. రెయిన్బో విద్య సంస్థలు నాణ్యమైన విద్యను అందించడం తో పాటు విద్యార్థుల సంపూర్ణ వికాసానికి కృషి చేస్తుందని, తమ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించడానికి సిద్ధం చేస్తున్నామని కరెస్పాండ్ అతాఉల్లా ఖాన్ గారు తెలియ చేశారు. చిన్నప్పటి నుంచి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులలో పెంపొందించడం ద్వారా తమ పాఠశాల నుంచి భవిష్యత్తు లో చాలా మంది శాస్త్రవేత్తలు కావచ్చని పేర్కొన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లి దండ్రులకు అభినందనలు తెలిపారు.

# డక్కిలి మండలంలో బాబుష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమం



స్వర్ణసాగరం ప్రతినిధి డక్కిలి

తిరుపతి జిల్లా డక్కిలి మండలం సదరు పంచాయతీ నందు,వైస్సార్సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు,వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి మండలం, డక్కిలి పంచాయతీలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ వైస్సార్సీపీ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు డక్కిలి మండల వైస్సార్సీపీ పార్టీ అధ్యక్షుడు చింతల శ్రీనివాసులు రెడ్డి,వైస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలతో కలసి డక్కిలి లో క్యూ ఆర్ కోడ్ ను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు చింతల శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు అనేక హామీలు ఇచ్చి,తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను మరచిపోయారని తెలిపారు.రైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో విఫలమైన కూటమి ప్రభుత్వం,బీసీలకు 50 సంవత్సరాలుగా పింఛన్ అందిస్తామని మోసం చేసారని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా ఉద్యోగులను మోసం చేశారని,నిరుద్యోగ భృతి చెల్లించకపోవడం,విద్యుత్ బిల్లులు అధికంగా పెంచడం,ఇలా చెప్పిన హామీలన్నీ ఇవ్వకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ కూటమి ప్రభుత్వం విఫలమైందని,రాష్ట్ర ప్రజలకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డక్కిలి మండలం వైస్సార్సీపీ నాయుకులు,కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అడవి ఆవుల వేటగాళ్ల పై అటవీ అధికారులు దాడులు



స్వర్ణసాగరం ప్రతినిధి డక్కిలి

తిరుపతి జిల్లా డక్కిలి మండలం ఆల్తూరుపాడు బీట్ పరిధిలో అడవి ఆవులను వేటగాళ్లు విద్యుత్ తీగలు తీసి వాటిని చంపడం జరుగుతుందని తెలుసుకున్న ఫారెస్ట్ డిఆర్ఓ ప్రతాప్ రెడ్డి తన సిబ్బందితో కలిసి అడవిలో గాలింపు చర్యలు చేపట్టాగా వేటగాళ్లు తప్పించుకుని పారిపోగా అక్కడ విద్యుత్ వైర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ డిఆర్ఓ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ డక్కిలి మండల సమీప గ్రామాలలోని వ్యక్తులు గోమాతగా కొలిచే అడవి ఆవులను కరెంటు తీసి చంపడం చాలా నేరం అలాంటి వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.మరియ చుట్టుపక్కల గ్రామాలలోని ప్రజలు తమ బాధ్యతగా తీసుకొని ఇలాంటి పనులు చేస్తున్న వ్యక్తుల గురించి మా అటవీ అధికారులకు తెలియజేయాలని కోరారు.

# ఘనంగా టిడిపి అధ్యక్షులు జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి సంబరాలు



స్వర్ణ సాగరం ఓజిలి జూలై 24:

మండల కేంద్రమైన ఓజిలి గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు కంకణాల వరప్రసాద్ నాయుడు నివాసంలో గురువారం మండల టిడిపి అధ్యక్షులు గుజ్జలపూడి విజయ్ కుమార్ నాయుడు 57వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా విజయ్ కుమార్ నాయుడు ను శాలువాతో సన్మానించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ నాయకులు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, జయసుంద్రారెడ్డి, అట్ల మల్లికార్జున యాదవ్ , కోటేశ్వరరావు యాదవ్ , సుధాకర్ రెడ్డి పేరంశెట్టి నాగయ్య , బెల్లం ప్రభాకర్ నాయుడు, ఉమ్మడి నారాయణ , యాదవ్ సుబ్రహ్మణ్యం రాజు , మోహన్ రాజు మైనారిటీ నాయకులు ఖలీల్, అల్లా బక్షు, వూసా వెంకటేష్ యాదవ్, కోడి పిల్ల సురేష్ యాదవ్, ఓజిలి వెంకటయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే మురళీమోహన్ ని కలిసిన డాక్టర్ రెడ్డప్ప

ఐరాల జులై 24 స్వర్ణ సాగరం

డాక్టర్ రెడ్డప్ప ఐరాల మండల వైద్యాధికారి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఐరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మహిళా వైద్యురాలు కావాలని అందుకు ఖాళీగా ఉన్న డాక్టర్ వాణి ఆయుష్ వైద్యాధికారిణి తక్షణమే ఐరాల ప్రాథమిక ఆరోగ్యానికి పంపించవలసిందిగా మహిళ రోగులకు ఉపయోగ ఉంటుందని తెలియజేశారు, అనంతరం పొలకల ఉపకేంద్రం మరియు ఆయుష్ వైద్యశాలను పరిశీలించి ఈ సెంటర్లను కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లగా మార్చేందుకు ప్రణాళిక సిద్ధంగా ఉందని తెలియజేశారు, జాతీయ రహదారికి పక్కనే ఉండటంలో పొలకల గ్రామంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఎమర్జెన్సీ అత్యవసర చికిత్స కేంద్రాన్ని తొందర్లో ప్రారంభిస్తామని తెలియజేశారు, అనంతరం రాష్ట్ర అవార్డు గ్రహీత డాక్టర్ రెడ్డప్పను జ్ఞాపకతో అభినందించారు, వైద్య వృత్తి చాలా ఉన్నతమైనదని అన్ని సదుపాయాలు అందజేస్తామని వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జి హరిబాబు నాయుడు, ఐరాల జడ్పిటిసి వి .సుచిత్ర కన్నయ్య నాయుడు, సింగల్ విండో అధ్యక్షుడు శేషాద్రి నాయుడు, పూర్ణచంద్రరావు, మండలంలో నాయకులు కార్యకర్తలు అభిమానులు వైద్య శాఖ అధికారులు సిబ్బంది, ఐరాల ఎమ్మార్వో ఎంపీడీవో ఐరాల



ఎస్సై, విద్యుత్ శాఖ ఏఈ, ఆర్డబ్ల్యూఎస్ నందకిషోర్, ఏపీవో, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 'నోవా ఎయిర్' తో శ్రీసిటీ ఒప్పందం

## - పారిశ్రామికవాడలో నైట్రోజన్ గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు
## - అత్యుత్తమ మౌళిక వసతుల కల్పనలో మరో ముందడుగు




**శ్రీసిటీ,స్వర్ణ సాగరం జూలై 24, 2025:**

పారిశ్రామిక కేంద్రంలో ప్రపంచశ్రేణి మౌళిక సదుపాయాల కల్పనలో శ్రీసిటీ మరో ముందడుగు వేసింది. నైట్రోజన్ గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటులో భాగంగా నోవా ఎయిర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ తో శ్రీసిటీ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా ఈ ప్రాంతంలోని తయారీ రంగ పరిశ్రమలకు స్థిరమైన, నాణ్యమైన నైట్రోజన్ గ్యాస్ సరఫరా అవుతుంది. ఒప్పందం మేరకు, నోవా ఎయిర్ సంస్థ స్వంతంగా పైప్‌లైన్ వ్యవస్థ ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణ చేపడుతుంది. పారిశ్రామికవాడ అంతటా సమర్థవంతమైన గ్యాస్ పంపిణీని అనుమతిస్తూ అవసరమైన ప్రత్యేక హక్కులను కంపెనీకి మంజూరు చేసింది. కొనసాగుతున్న పారిశ్రామిక కార్యకలాపాలకు అంతరాయం లేకుండా దశలవారీగా ఈ ప్రాజెక్ట్ అమలు చేయబడుతుంది.శ్రీసిటీని పారిశ్రామిక మౌళిక సదుపాయాలకు ఉత్తమ నమూనాగా మార్చే మా ప్రయాణంలో నోవా ఎయిర్‌తో ఈ భాగస్వామ్యం మరో ముందడుగుగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధికి ఆవిష్కరణ, సుస్థిరత, ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందించాలన్న తమ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. ఈ ఒప్పందం పట్ల నోవా ఎయిర్ టెక్నాలజీస్ MD & CEO గజానన్ నబార్ సంతోషం వ్యక్తం చేశారు. యుటిలిటీ పైప్‌లైన్ నెట్‌వర్క్ సదుపాయం అభివృద్ధి చెందిన దేశాలలోని పారిశ్రామిక పార్కులలో సర్వ సాధారణమైనది కాగా, భారతదేశంలో ఈ తరహా చొరవ ఇదే మొదటిసారి కావచ్చని వ్యాఖ్యానించారు. వినియోగదారులకు స్థిరమైన, నాణ్యమైన గ్యాస్ సరఫరా పరిష్కారాలను అందించడానికి, ఉత్పాదకతను పెంచడానికి ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం తమకు వీలు కల్పిస్తుందని పేర్కొన్నారు. కీలకమైన ఈ సదుపాయం శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని పై రెండు సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రక్రియ పరిశ్రమల అవసరాలను తీర్చడంలో విశేషంగా ఉపయోగపడడంతో పాటు భవిష్యత్ పెట్టుబడులకు శ్రీసిటీని మరింత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మార్చేందుకు దోహదకారిగా మారుతుందని చెప్పొచ్చు.

## ఇంచార్జ్ కృపా లక్ష్మి ఆధ్వర్యంలో ఎంసీ విజయానందరెడ్డి..జన్మదిన వేడుకలు





**శ్రీరంగరాజపురం :స్వర్ణసాగరం: (జూలై 24)**

చిత్తూరు వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ ఎంసి విజయానంద రెడ్డి 57వ జన్మదిన వేడుకలను గంగాధర నెల్లూరు ఇంచార్జ్ కృపా లక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి శ్రేణులు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. యువ నాయకుడు , నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్యామ్ రాజ్, యువనేత స్కైలా ఆధ్వర్యంలో కొత్తపల్లి మెట్ట కేంద్రంలో గురువారం కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. జన్మదిన పురస్కరించుకొని అడుగడుగునా భారీ ఎత్తున భారీసంచా కాల్చారు. అనంతరం పేదలకు వస్త్ర దానం చేశారు. ఈ సందర్భంగా శ్యామ్ రాజ్ మాట్లాడుతూ మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఇంచార్జ్ కృపా లక్ష్మి ఆధ్వర్యంలో, ఎంసీ విజయనందరెడ్డి తోడుగా మండలంలో ఉన్న ఎస్సీ నాయకులను కలుపుకుని పార్టీని ముందుకు తీసుకెళ్తానని శపథం చేశారు. అలాగే కృపా లక్ష్మి గెలుపు కోసం తను సాయి శక్తుల కృషి చేస్తానని కార్యకర్తలకు ప్రతిన భూనారు . ఈ సందర్భంగా మాజీ సర్పంచ్లు, మనీ, విజయబాబు, లోకనాథ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, నేతలు, తదితరులు పాల్గొన్నారు

## విజయానంద రెడ్డి జన్మదినం.. ఉప్పొంగిన అభిమానం...






**కొత్తపల్లి మిట్ట: స్వర్ణ సాగరం: ( శ్రీరంగరాజపురం) (జూలై 24)**

చిత్తూరు వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ వైఎస్ఆర్సిపి నేత, ఎంసి విజయానంద రెడ్డి 57 వ జన్మదినం పురస్కరించుకొని అభిమానులు ఉప్పొంగే రీతిలో కేక్ కట్ చేసి ఆడంబరాలు ఘనంగా చేసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లి మెట్ట కేంద్రంలో గురువారం స్థానిక సర్పంచ్ డివి డిల్లయ్య ఆధ్వర్యంలో విజయానందరెడ్డి జన్మదిన వేడుకలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వినూత్న రీతిలో యువ నాయకుడు, స్థానిక సర్పంచ్ తనయుడు పవన్ కుమార్, బిగ్ బాస్ ఆధ్వర్యంలో వివిధ రకాల పండ్ల చెట్లకు విజయానంద రెడ్డి స్టిక్కర్ అతికించి, నేతలకు, కార్యకర్తలకు, అభిమానులకు పంచిపెట్టారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కోదండయ్య, గోవిందయ్య, మాజీ సర్పంచ్ విజయబాబు, దేవరాజుల రెడ్డి, కార్యకర్తలు సీకే బాబు, మైకేల్, తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాకు కఠిన చర్యలు తప్పవు

## ప్రగతి డైరెక్టర్ కెవి రమణ

**రేణిగుంట స్వర్ణ సాగరం జూలై**





జూలై 30వ తేదీన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని, జూలై 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు ప్రతి రైల్వే స్టేషన్లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్ట్ ద్వారా ప్రగతి సంస్థ రేణిగుంట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో ఈరోజు రేణిగుంట రైల్వే స్టేషన్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఫ్లాట్ ఫార్మ్ పైన ప్రయాణికులకు పాంప్లెట్స్ పంచిపెట్టి మానవ అక్రమ రవాణా పైన అవగాహన కలిగించారు. ఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లలు మరియు మహిళలు ఈ అక్రమ రవాణా లో చిక్కుకుని అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. సమాజంలో జరుగుతున్నటువంటి దురాచారాన్ని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. మానవ అక్రమ రవాణా వల్ల కలిగే నష్టాలు, మరియు అక్రమ రవాణాకు పాల్పడే వారికి విధించే కఠిన శిక్షల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా సమాజంలో తీవ్రమైన నేరమని, ఇది ఒక వ్యాపారంగా మారిందని, దీనివల్ల అనేక మంది యువతీ యువకులు తన జీవితాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ రకాల పనుల కోసం, ఇతర కార్యకలాపాల కోసం ఏజెంట్ల ద్వారా రైళ్లలో ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి యువతీ యువకులను తరలించడం వంటి వివిధ రూపాల్లో మానవ అక్రమ రవాణా జరుగుతుందని ఆయన తెలిపారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడే ప్రతి ఒక్కరికీ కఠినమైన చట్టపరమైన శిక్షలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. రైళ్లలో పిల్లలను తీసుకెళ్తున్న అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే 1098 మరియు 1800 1027 222 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. రైలు ప్రయాణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సమాజంలో మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు, ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ, స్టేషన్ మాస్టర్ శేషగిరి నాథ్ రెడ్డి , ఎస్సై డి రమేష్, ఏఎస్ఐ ఎం నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ యు.రమేష్ , పి ధనరాజ్ సిబ్బంది, ప్రగతి సంస్థ జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యానాది సంఘం అధ్యక్షుడు చందమామల కోటయ్య, కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ మధు కుమార్ మరియు లత పాల్గొన్నారు.

## ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ మీటింగ్



**ఏర్పేడు-స్వర్ణ సాగరం జులై 24**

ఏర్పేడు మండలం బండారుపల్లిలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్థాయి సమావేశం నిర్వహించారు. బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యతోనే పేదరికం నిరక్షరాస్యత రూపమాపుతుందని తెలిపారు ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా నిరక్షరాస్యత బడి మానేసిన పిల్లలు బాల్యవివాహాలు బాల కార్మికులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు గుర్తించి ప్రభుత్వ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు సహకారంతో బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించుటకు కృషి చేస్తున్నామని తెలిపారు స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ భారతి మాట్లాడుతూ అంగనవాడిలో మూడు సంవత్సరాల నిండిన పిల్లలందరినీ అంగన్వాడీలో చేర్పించాలని కోరారు గర్భిణీ స్త్రీలు బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం పాలు గుడ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు మహిళా పోలీస్ బతుకమ్మ మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు బాలికలకు బాల్య వివాహాలు చేయకూడదని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని బాల్య వివాహాలు చేసిన ప్రోత్సహించిన వారిపై చట్టరీత్యా కెరీర్లు ఉంటాయని చర్యలు ఉంటాయని తెలిపారు. శ్రీకాళహస్తి మండలం కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి పిల్లవాణ్ణి బడిలో చేర్పించాలని తల్లిదండ్రులని కోరారు ఈ కార్యక్రమంలో బండారుపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత కార్యదర్శి బాబు వివిధ శాఖల అధికారులు సిబ్బంది ప్రగతి సిబ్బంది వెంకటేష్ మురుగయ్య గ్రామస్తులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భూ సమస్యలపై తహసిల్దార్ కి వినతి పత్రం



**దక్కిలి మండలం బి.ఎస్.పి అధ్యక్షుడు నావూరు వెంకటేశ్వర్లు**

**స్వర్ణసాగరం ప్రతినిధి దక్కిలి**

తిరుపతి జిల్లా దక్కిలి మండలం వెంబులూరు పంచాయతీ నుండి భూ సమస్యలపై దక్కిలి మండలం బిఎస్పి అధ్యక్షులు నావూరి వెంకటేశ్వర్లు తహసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా నావూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలని,ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీల భూములపై జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా వెంబులూరు గ్రామపంచాయతీ అంబేద్కర్ నగర్ గ్రామంలో విమలమ్మ అనే ఓ దళిత మహిళ కొద్దికాలం నుండి భూ సమస్యపై నిరంతరం దక్కిలి మండల రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతుందని,ఆ సమస్యపై రెవెన్యూ అధికారులు పూర్తి విచారణ జరిపి వీలైనంత త్వరలో ఆమెకి న్యాయం చేకూర్చేలా చర్యలు చేపట్టాలని బిఎస్ పి మండల అధ్యక్షులు నావూరు వెంకటేశ్వర్లు తెలియజేశారు.

## ఈశ్వర్ కళ్యాణ్ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నోట్ పుస్తకాలు పంపిణీ





**బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.జూలై 24**

బంగారుపాళ్యం మండలం లోని పలు పంచాయతీలలో ఈశ్వర్ కళ్యాణ్ అభయ ఫౌండేషన్ సేవా కార్యక్రమం ద్వారా నోట్ బుక్స్ పెన్నులు జామెంట్రీ బాక్సులు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు గురువారం అందించారు.ఈ కార్యక్రమంలో శెట్టేరి, తూంపాయనపల్లి,నల్లంగాడు,పిడివి కండిగ,కాటప్ప గారిపల్లి,ఎద్దులవారిపల్లి బోడబండ్ల,ఎర్రాండ్లపల్లి గుంతూరు,మరికొన్ని గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత మరియు జడ్పీ హైస్కూల్ వరకు అందించడం జరిగిందని తెలిపారు. ఈశ్వర్ కళ్యాణ్ మాట్లాడుతూ,పేద విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మంచి ఉద్యోగాలు సంపాదించి పేదరికాన్ని నిర్మూలించే దిశగా గొప్ప గొప్ప ఉద్యోగాలు పొందాలని విద్యార్థిని విద్యార్థుల పట్ల ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల ఎంఈఓ పి. నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రఘుపతి నాయుడు, బుజ్జి నాయుడు, కృష్ణ,నరేష్, భువన నాయుడు తదితరులు పాల్గొన్నారు

# ఇంటిని దగ్ధం చేసిన వారి పై పోలీసు కేసు



రేణిగుంట స్వర్ణ సాగరం జూలై 24

రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ పరిధిలోని దొడ్లమెట్ట గ్రామంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక యువకుడు నవీన్ ప్రసాద్ (వయసు 24), తండ్రి రవీంద్రబాబు వందరోజుల కరువు పనులు చేస్తూ జీవనాన్ని సాగించే వ్యక్తి బాధితుడు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గ్రామానికి చెందిన ద్రాక్షాయిని అనే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో ఆమె భర్త రామాంజనేయులు మరియు అతని అన్న ఆదినారాయణ 2025 జూలై 24వ తేదీ వేకువజామున సుమారు 2:30 గంటల సమయంలో బాధితుడి ఇంటికి చేరుకుని పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోయినా, బాధితుడి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఉన్న వస్తువులన్నీ మంటల్లో ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్స్పెక్టర్ జయ చంద్ర ఉత్తర్వులు మేరకు ఎస్సై పి అరుణ్ కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# స్మశాన వాటికలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం..



## -స్మశాన వాటికలో ముళ్లపొదులు తొలగింపు

ఏర్పేడు-స్వర్ణ సాగరం జులై 24

ఏర్పేడు మండలం, చింతలపాలెం గ్రామపం చాయతీలో పంచాయతీ కార్య దర్శి ప్రసన్న ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్ట డం జరిగింది. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు అధికంగా పెరిగిన ముళ్లపొదలను చింతలపాలెం స్మశాన వాటిక, ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంక్ ఆవరణంలో జెసిబి సహాయంతో తొలగించడం జరిగింది. అలాగే ఓవర్ హెడ్ ట్యాంక్ ఔటర్ వాటర్ ఫ్లో పైప్ లైన్ లీకేజ్ కావడంతో మరమ్మతులు చేయించడం జరిగింది.

# శక్తి మొబైల్ యాప్ అవగాహన కార్యక్రమం



స్వర్ణసాగరం బైరెడ్డిపల్లి జూలై 24:-

చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లి మహిళల భద్రతను పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'శక్తి' మొబైల్ యాప్ చొరవను ప్రోత్సహించడానికి బైరెడ్డిపల్లి ఎస్ ఐ పరుశురాముడు,బృందం ముమ్మరంగా గురువారం అవగహన కార్యక్రమం చేపట్టారు.అత్యవసర సమయాల్లో మహిళలకు తక్షణ పోలీసు సహాయం అందించడానికి ఈ యాప్‌ను అభివృద్ధి చేసినట్లు మహిళలకు తెలియజేశారు.హెచ్చరిక అందిన వెంటనే, సమీప స్టేషన్ నుండి పోలీసు బృందాలను సంఘటన స్థలానికి పంపుతామని, ఐదు నిమిషాల్లో బాధితురాలిని చేరుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంటామని వివరించారు. ఈ యాప్ మహిళలు ఇంటి నుండే ఫిర్యాదులు దాఖలు చేయడానికి సహాయపడుతుంది, భద్రత మరియు గోప్యత రెండింటినీ నిర్ధారిస్తుందన్నారు.

# సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామకృష్ణ





స్వర్ణసాగరం, వెంకటగిరి, జూలై:24

వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం మండలంనందు సుపరిపాలనలో తొలి అడుగు...ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం లో మండలములోని తురిమెర్ల పంచాయతీ నందు నియోజకవర్గ పరిశీలకులు మరియు రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్య గారితో కలిసి పాల్గొన్న శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో అమలు చేసిన పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించడమైనదిఎన్టీఆర్ భరోసా పింఛన్, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాల అమలుపై ప్రజలను ఆరా తీయడమైనది ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ, ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం ప్రారంభిస్తున్నట్లు వెల్లడి సూపర్ సిక్స్ పథకాల హామీని నెరవేర్చడంతో పాటు రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం యొక్క లక్ష్యంసీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ బాబు సారథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో ఏపీ కొత్త చరిత్ర సృష్టిస్తోందన్న ప్రజలకు తెలియపరచడమైనదిఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇంచార్జీలు, నియోజకవర్గం అనుబంద కమిటీ సభ్యులు, నియోజకవర్గం, మండల కమిటీ సభ్యులు, యువత, టీన్సప్ కమిటీ సభ్యులు,ఐటీడీపి నాయకులు, స్థానిక గ్రామ నాయకులు, కార్యకర్తలు, బూత్, కుటుంబ సాధికార సారద సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ముప్పూరి రంగయ్య నాయుడు హత్య కేసులో మను పాటీ బాలాజీ అరెస్ట్

స్వర్ణసాగరం తవణంపల్లి జూలై 24

చిత్తూరు జిల్లా తవణంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జూలై 20 వ తారీఖు ఉదయం తెల్లగుండ్లపల్లి గ్రామం నందు ముప్పురి రంగయ్య నాయుడు, వయస్సు 78 సం", తండ్రి పేరు లేట్ రాజ గోపాల్ నాయుడు తెల్లవారుజాము సమయములో వాళ్ళ ఇంటిముందర ఉన్న తన ట్రాక్టర్ షెడ్డు ముందర ఉరి వేసుకొని అనుమానాస్పదంగా చనిపోయాడు. ఈ విషయంగా తవణంపల్లి పొలిసు స్టేషన్ నందు సి ఆర్ నెంబర్ 61/2025, %ఖ% యు/ ఎస్ ఈ సి. 103(1) బి ఎన్ ఎస్ గా కేసు నమోదు చేయడం అయినది. చిత్తూరు జిల్లా ఎస్పీ.ఎన్. మణికంఠ చందోలు, ఐపీఎస్ ఆదేశాలు మేరకు, చిత్తూరు డి.ఎస్.పి. %%. సాయినాథ్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఈ దినం 24.07.2025 వ తేది మధ్యాహ్నం 12.00 గంటలకు ఐరాల మండలం, తిరుపతి %-% బెంగులూరు జాతీయ రహదారి, బొమ్మసముద్రం బ్రిడ్జి వద్ద చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వి శ్రీధర్ నాయుడు , ఎస్సై తవణంపల్లి ముద్దాయి మనుపాటి బాలాజీ ని అరెస్ట్ చేసి, అరెస్ట్ కి గల కారణాలను తెలిపి మరియు చట్టముతో గర్షణ పడుతున్న బాలుడుని నిర్బంధం చేసి,నిర్బంధానికి గల గల కారణాలను వారికీ తెలుపడం అయినది. తేది 19.07.2025 సాయంత్రం తెల్లగుండ్లపల్లి గ్రామంలో జరిగిన చిన్నపాటి ఘర్షణను మనుసులో పెట్టుకొని ముద్దాయి మనుపాటి బాలాజీ, వయస్సు 18 సం",, తండ్రి ఎం. భాస్కర్, ఆర్/%శీ% దిగువతోటదిగువతోటరాగానపల్లి గ్రామం, పట్టంపల్లి పోస్ట్, తవణంపల్లి మండలంమరియుచట్టముతో గర్షణ పడుతున్న బాలుడు పథకం ప్రకారం కేసులో పోతీశముగా ఉండు ముప్పురి రంగయ్య నాయుడిని 20.07.2025 వ తేది తెల్లవారుజాము సమయములో వాళ్ళ ఇంటిముందర ఉన్న పోతి ట్రాక్టర్ షెడ్డు వద్ద, పోతిని చేతి పిడికిలితో బలంగా గుద్దగా పోతి కింద పడి తనకలాడుతుండగా, అక్కడే ఉన్న టెంకాయ నార మరియు నైలాన్ త్రాడుతో అతని రెండు చేతులును, కాళ్ళను కట్టేసి, మెడకు ఉరివేసి బలంగా లాగి పోతి చనిపొయిన తరువాత అదే తాడుతో ట్రాక్టర్ షెడ్డు లో పైన ఉన్న ఇనుప పైపుకి అదే తాడుతో పైకి లాగి వేలాడ తీసారు అని విచారణలో తెలిసినది. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ. వి. శ్రీధర్ నాయుడు ఎస్సై, తవణంపల్లి వార్లను చిత్తూరు ఎస్పీ ప్రేత్యకంగా అభినందించారు .

# పాపా నాయుడు పేటలో సుపరిపాలన తొలి అడుగు

ఏర్పేడు-స్వర్ణ సాగరం జులై 24



శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాలతో ఈరోజు ఏర్పేడు మండల% పాపానాయుడుపేట గ్రామములో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమము లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచినారు. మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజు నాయుడు మాటాడుతూ తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి దక్కుతాయని స్పష్టం చేశారు అదేవిధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పేరం ధనంజయులు నాయుడు పున్నారావు శివశంకర్ రెడ్డి, బత్తల గిరినాయుడు, బాబునాయుడు, సూరినాయుడు, సుధాకర్ రెడ్డి,క్రిష్ణప్ప మొదలియార్, సీతాపతి ఆచారి, చిరంజీవులు నాయుడు, సుబ్రహ్మణ్యం(యూనిట్) టి శేఖర్ , పద్మనాభం నాయుడు, శివ,మురళి,జాఫర్, అర్జున్ బాబు, సుందరబాబు, తాంబా శ్రీనివాసులు, రవికుమార్, రాజేంద్ర, రోశయ్య, డి క్రిష్ణ, సుబ్రహ్మణ్యం, టి విజయ్, క్రిష్ణయ్య , భాస్కర్, ఎర్రబ్బా, లోకేష్, షాహీర్ బాషా, సురేష్, కందవేలు డాక్టర్ మునెయ్య, హంస, గణేష్ నాయుడు,చలపతి నాయుడు, భూపతి నాయుడు, మనోహర్ నాయుడు జయప్రకాష్ నారాయణ, బాలకృష్ణ, బాలాజీ,సుధాకర్ నాయుడు, మనోహర్ నాయుడు,మండల తెలుగుదేశం పార్టీ నాయకులు%a% కార్యకర్తలు, పాపానాయుడుపేట పంచాయతి టీడీపీ నాయకులు పాలుగున్నారు

# మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి చర్యతో రెండుగా చీలిన వైఎస్ఆర్సిపి కేడర్...?

## -ఒక ప్రక్క హరికృష్ణ ఫోటో బ్యానర్... మరో ప్రక్క డిప్యూటీ సీఎం కృపాలక్ష్మితో బ్యానర్..?

శ్రీరంగరాజపురం :స్వర్ణసాగరం: (జూలై 24)

గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ గా కృపా లక్ష్మి వ్యవహరిస్తున్నారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తనయ కృపా లక్ష్మి గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా నిలబడి ఓడిపోయారు. తదనంతరం సంవత్సరం వ్యవధిలోని వైఎస్ఆర్సిపి పార్టీలో నాయకులు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు రెండు వర్గాలుగా చీలిపోయిన వ్యవహారం గత సంవత్సరం కాలంగా నియోజకవర్గంలో స్పష్టంగా కనబడుతోంది. ఈ మధ్యకాలంలో వైఎస్ఆర్సిపి, మాజీ మంత్రి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అనుచరులుగా మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ తనయుడు ఆనగంటి హరికృష్ణ వీరి దూతగా నియోజకవర్గంలో ప్రతి కార్యక్రమానికి హాజరవుతూ పార్టీ కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుంది. ఇలాంటి పరిణామాలతో నియోజకవర్గంలో ఉన్న నేతల్లో ,కార్యకర్తల్లో చర్చనీయాంసం అయింది. ఈ మధ్యనే వెదురు కుప్పం మండలంలో వైఎస్ఆర్సిపి నేత పేట ధనంజయ రెడ్డి ఆధ్వర్యంలో హరికృష్ణ వర్గంగా ఉంటూ నిత్యం ప్రజల్లో ప్రతి కార్యక్రమంలో పాల్గొని దూసుకెళ్తున్నారు.

### విజయానంద రెడ్డి జన్మదిన వేడుకలు బట్టబయలైన వర్గ పోరు..?

గురువారం గంగాధర నెల్లూరు నియోజకవర్గం, శ్రీ రంగరాజపురం మండలం, కొత్తపల్లి మిట్ట కేంద్రంగా వైఎస్సార్సీపి చిత్తూరు ఇంచార్జ్ ఎంసి విజయానంద రెడ్డి 57వ జన్మదిన వేడుకలు జరిగింది. ముందుగా కృపా లక్ష్మి వర్గంగా యువ నాయకుడు, ఎస్సీ సెల్ నేత శ్యామ్ రాజ్ ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేసి, పార్టీ కేడర్ తో బ్యానర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకుడు, వైఎస్ఆర్సిపి సర్పంచ్ డివిడిల్లయ్య, వారి అనుచర వర్గం హాజరు కాలేదు. గురువారం సాయంత్రం సర్పంచ్ ఆధ్వర్యంలో పవన్ కుమార్, బిగ్ బాస్ యువ నేతల కలిసి విజయానంద రెడ్డి జన్మదిన వేడుకలు ఏర్పాటు చేశారు. వీరు ఏర్పాటు చేసిన బ్యానర్లో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ కృపా లక్ష్మి ఫోటోలు లేకుండా ముద్రించారు.

### మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి చర్య తో పార్టీలో వర్గ పోరు తప్పడం లేదు..?






మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి గత 40 ఏళ్లుగా రాజకీయం చేస్తున్నారు. ఇదివరకే గంగాధర నెల్లూరు నియోజకవర్గం లో రెండు దపాలుగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మంత్రి పదవితోపాటు, డిప్యూటీ సీఎం గా వ్యవహరించారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో తనకు అనుచరులుగా కొద్దిమందికే ప్రాధాన్యత ఇచ్చేవారు. ఇలాంటి ఘటనతో నారాయణస్వామి పై గత ఎన్నికల్లో భారీ వ్యతిరేకత ఏర్పడింది. ఒకానొక దశలో నారాయణస్వామికి ఎమ్మెల్యే సీటు ఇవ్వకపోవడం, ఆపై కుమార్తె కృపాలక్ష్మికి సీటు ఇవ్వడం జరిగింది. నారాయణస్వామి పై ఉన్న అసమ్మతి తో దాదాపు 47 వేల మెజార్టీ ఓట్లు టిడిపి పొందగలిగింది. పార్టీలో గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరిని, తన గోపిష్టితో దూరం చేసుకోవడం ఈయనకి అలవాటు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి చర్యతో నేడు కొత్తపల్లి గ్రామ సర్పంచి డివి డిల్లయ్య వ్యవహారంలో అసమతి రాజేసింది. కొత్తపల్లి మిట్ట పంచాయతీలు వైసీపీ వర్గం రెండుగా చీలడానికి కారణం అయ్యారని ఆరోపిస్తుఅయ్యారనిసర్పంచిగా తన బాధ్యత వహిస్తున్న గ్రామంలో, నాకు తెలియకుండా, నన్ను సంప్రదించకుండానే వేరొకరికి బాధ్యత అప్పగించడంపై, డివి డిల్లయ్య వర్గం వ్యతిరేకిస్తుంది. ఈ ఘటనతో నేడు యువనేత హరికృష్ణ ఆధ్వర్యంలో బ్యానర్ ఏర్పాట్లు చేశామన్నారు . ఈ సంఘటనతో కార్యక్రమానికి హాజరైన నేతలు, కార్యకర్తలు, అభిమానులు దిక్కుతోచని స్థితిలో మతిని పోగొట్టాయి. ఇకనైనా ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఇంచార్జ్ కృపా లక్ష్మి వ్యవహార శైలిని మార్చుకొని, పార్టీలో అందరినీ కలగలుపు కొని పోయే నాయకత్వం అవసరం అని పలువురు నాయకులు, వైఎస్ఆర్సిపి అభిమానులు కోరుతున్నారు.



# మా పాఠశాలకు దారి చూపండి సారూ..



- వంజివాక విద్యార్థుల వేడుకోలు
- గుంతల రహదారితో ఆగిన ఆర్టీసీ బస్సు
- ప్రయాణ సౌకర్యం లేక వారం రోజులుగా
- పాఠశాలకు దూరమైన విద్యార్థులు
- పాఠశాలకు వెళ్ళేందుకు దారి చూపాలని
- కోరుతున్న పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు




**వాకాడు/ కోట స్వర్ణసాగరం :**

వంజవాక పాఠశాల విద్యార్థులకు రహదారి కష్టాలు వెంటాడుతున్నాయి. భారీ గుంతలతో మరమ్మతులకు గురైన రహదారి కారణంగా రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో అర్ధదారిపై ప్రయాణానికి ఆర్టీసీ మొహం చాటేసింది. దీంతో పాఠశాల విద్యార్థులకు ప్రయాణ కష్టాలు మొదలయ్యాయి. వారం రోజులుగా ఆర్టీసీ బస్సు రాకపోవడంతో తూపిలి పాలెం, గంగన్న పాలెం, ములగనూరు గ్రామాల నుంచి వంజి వాక పాఠశాలకు వెళుతున్న 60 మంది విద్యార్థులు పాఠశాలకు దూరమయ్యారు. వివరాలకై.. పర్యాటక అభివృద్ధిలో భాగంగా గత ప్రభుత్వం కోట మండలం నెల్లూరు పల్లి కొత్తపాలెం నుంచి వాకాడు మండలం వాలమేడు గ్రామం వరకు రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. టెండర్లు కూడా పిలిచింది. టెండర్ దక్కించుకున్న నెల్లూరుకు చెందిన కాంట్రాక్టర్ ఆ రహదారిపై అప్పటికే ఉన్న తారు రోడ్డును తొలగించారు. అక్కడక్కడ గ్రామాల పరిధిలో సిసి రోడ్లు కూడా నిర్మించారు. సిసి రోడ్లు మినహా మిగిలిన తారు రోడ్డు నిర్మాణానికి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా ఆపివేశారు. దానికి తోడు 2023 లో భారీ తుఫాన్లు సంభవించడంతో రహదారి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి మరింత ప్రమాదభరితంగా మారింది. కాంట్రాక్టర్ తాత్కాలికంగా దెబ్బతిన్న రహదారిపై అక్కడక్కడ గ్రావెల్ పోసినప్పటికీ. గత వారం రోజులుగా పడుతున్న స్వల్ప వర్షాలకు గొంతలు మరింత లోతుగా మారడంతో ప్రయాణానికి తీవ్ర అడ్డంకులు ఏర్పడింది. భారీ గుంతల్లో ఆర్టీసీ బస్సు ఇరుక్కుపోవడంతో అర్ధదారిపై ప్రయాణం సాగించలేక ఆర్టీసీ అధికారులు బస్సు రవాణా నిలిపివేశారు. దీంతో ఆ బస్సులో ప్రయాణించి పాఠశాలకు చేరుకునే 60 మంది విద్యార్థులకు పాఠశాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయం లేక వారం రోజులుగా పాఠశాలకు దూరమయ్యారు. దీంతో ఆ రహదారికి మరమ్మతులు చేపట్టి బస్సు ప్రయాణానికి దారి సుగుమనం చేసి పాఠశాలకు వెళ్లేందుకు దారి చూపాలని విద్యార్థులు వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు తమ విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యార్థులు పడుతున్న అవస్థలను దారి కష్టాలను వివరిస్తూ విద్యార్థులకు కష్టాలు తొలగించి పాఠశాలకు వచ్చేలా చేయాలని సామాజిక మాధ్యమంలో వీడియో పోస్ట్ చేయడం సంచలనంగా మారింది.

# రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టుకు నిరసనలు








**స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్**

శ్రీకాళహస్తి పట్టణంలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టును ఖండిస్తూ నిరసన ప్రదర్శనలు జరిగాయి. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి అరెస్టును నిరసిస్తూ శ్రీకాళహస్తి పట్టణంలోని గాలిగోపురం వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మిథున్ రెడ్డిని రాజకీయ లబ్ధి కోసం అరెస్ట్ చేయడం దారుణమని ఆయన అన్నారు. కూటమి కక్షపూరిత రాజకీయాలు ఎల్లకాలం సాగవని, కూటమి అరాచకాలపై ప్రజలు తిరగబడే కాలం దగ్గరలో ఉందని ఆయన హెచ్చరించారు. మిథున్ రెడ్డి అరెస్టును నిరసిస్తూ రాష్ట్రం మొత్తం తోడుగా ఉందని పేర్కొన్నారు. ఉండవల్లి అరుణ్ కుమార్ మాటలను చంద్రబాబు నాయుడు గుర్తుచేసుకోవాలని, రానున్న రోజుల్లో కూటమికి డిపాజిట్లు కూడా రావని వ్యాఖ్యానించారు. ప్రజలను గాలికి వదిలేసి, తన సినిమా టికెట్ రేట్లు పెంచుకున్న పవన్ కళ్యాణ్ తీరు బాధాకరమని అన్నారు. చంద్రబాబు కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని, లిక్కర్ స్కామ్ అనేది అభూతకల్పన అని ఆరోపించారు. వైయస్ జగన్మోహన్ రెడ్డికి వస్తున్న జనాదరణను చూసి ఓర్వలేక, ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలను దారి మళ్ళించేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. మద్యం అక్రమ కేసులో అరెస్ట్ చేసిన వారికి ఎలాంటి ఆధారాలు చూపలేదని, అక్రమ కేసులకు వైయస్ఆర్సిపి నేతలు ఎవరూ భయపడరని స్పష్టం చేశారు. చంద్రబాబు చేస్తున్న ప్రతి దానికి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరూ తారక శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, ఏర్పేడు మండల ఇంచార్జ్ గున్నేరీ కిషోర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ భాష, ఏర్పేడు మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, తొట్టంబేడు మండల అధ్యక్షుడు కోగిల సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ ఫరీద్, మున్నా రాయల్, జయ శ్యామ్ రాయల్, కంఠ ఉదయ్ కుమార్, మస్తాన్, యువజన విభాగం అధ్యక్షులు శ్రీవారి సురేష్, కోలూరు హరినాయుడు, ఆశ కిరణ్, పులి రామచంద్ర, ఫజల్, అస్లాం, వయ్యాల మనోహర్ రెడ్డి, భాస్కర్ ముదిరాజ్, రామచంద్రారెడ్డి, గంగాధరం, కొత్తపాటి శ్రీనివాస్ రెడ్డి, మస్తాన్, శివ కుమార్ యాదవ్, బాలిశెట్టి శేఖర్, పసల కృష్ణయ్య, మొద్దుమూడి రవి, ఇలగనూరు నాగరాజ్, చెంచయ్య నాయుడు, అంకయ్య, గిరిధర్ రెడ్డి, శ్రీరాముల రెడ్డి, కాణిపాకం సురేష్, గపూర్ భాష, షర్మిల ఠాగూర్, జూమ్లేష, డాక్టర్ శంకర్, నారాయణ, ఆరిఫ్, మా బాషా, యుగంధర్ రెడ్డి, పెరుమాల చౌదరి, జీవీకే రెడ్డి, అప్పిని సుధాకర్, బాబు, సుబ్రహ్మణ్యం, ముని కుమార్, గౌస్ బాషా, సి ఆర్ టి ప్రసాద్, ప్రసాద్ నాయుడు, కామి వెంకటేశ్వర్లు, మంచు సురేఖ, జై కృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి, నరేంద్ర, మోహన్ రెడ్డి, రాజా, లోకనాథ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, పుల్లయ్య, చంగల్రాయలు, ప్రభు, చిన్న, మణి రాజు, ఆర్ట్ మణి, కలివేలయ్య, కృష్ణారెడ్డి, రామ్మూర్తి, అట్ల రమేష్, ఇలియాజ్, నాగార్జున రెడ్డి, మునరత్నం రెడ్డి, కరిముల్లా, ముని కృష్ణారెడ్డి, రాజేంద్ర, చెంచయ్య నాయుడు, ఊరందూరు రంగయ్య, సాయి, యాకోబ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇలగనూరులో "సుపరిపాలనలో తొలి అడుగు" - టీడీపీ హామీలను నెరవేర్చే దిశగా బడ్జెట్ కార్యక్రమాలు



**స్వర్ణ సాగరం –తొట్టంబేడు,**

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలంలోని జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు గౌ. నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు, శ్రీకాళహస్తి శాసనసభ్యులు గౌ. బొజ్జల సుధీర్ రెడ్డి గారి సూచనలతో ఇలగనూరు గ్రామ పంచాయతీలో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం ప్రజల సహకారంతో విజయవంతంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలవుతున్నాయన్న సందేశంతో, ఇంటింటికీ కరపత్రాల పంపిణీ చేపట్టారు. ప్రజల అభిప్రాయాలు స్వయంగా తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమానికి తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షులు రావెళ్ల మునిరాజా నాయుడు కీ నేతృత్వంలో అనేక మంది నాయకులు పాల్గొన్నారు. ముఖ్యంగా:మాజీ పార్టీ అధ్యక్షులు గాలి మురళినాయుడుబూత్ ఇంచార్జ్ సుశేకర్ నాయుడుమాజీ సర్పంచ్‌లు మధు నాయుడు, మునిరత్నంగ్రామ పెద్దలు: ఈడూరు రామయ్య, పెంచలయ్య, సుబ్రహ్మణ్యంపెళ్లూరు రాజగోపాల్, బోనుపల్లి రామానాయుడు, ఎం. శంకరనాయుడు, శేషం నాయుడు, రమణారెడ్డికనపర్తి శంకర్ నాయుడు, కొన్నలి రాంచంద్రనాయుడు, కాసారం మాధవయ్య, కనపర్తి చలపతి ఎస్సీ సెల్ నాయకులు: సింగమాల భాస్కర్, గున్నయ్యమహిళా నాయకులు రమాదేవి, చంద్రకళసర్పంచ్‌లు మాధవి, గజలక్ష్మి, ఈడూరు రమణమ్మసచివాలయ సిబ్బంది, క్లస్టర్, యూనిట్ ఇంచార్జులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గ్రామస్థుల నుంచి విశేష స్పందనను అందుకుంది.



## కింగ్‌డమ్ మూవీ..
## ఏపీలో టికెట్ ధరల పెంపునకు అనుమతి

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ యాక్షన్ చిత్రం కింగ్‌డమ్. గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో వస్తోన్న ఈ చిత్రం జూలై 31న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ సినిమాలో విజయ్ సరసన భాగ్యశ్రీ బోర్సే కనిపించనుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ సినిమా టికెట్ రేట్ల పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతులిచ్చింది. సినిమా విడుదల రోజు నుంచి పది రోజుల వరకు ధరలు పెంచుకోవచ్చని ఆదేశాలిచ్చింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.50, మల్టీప్లెక్స్‌ల్లో రూ.75 అదనంగా వసూలు చేసేందుకు అనుమతులు జారీ చేసింది. కాగా.. ఈరోజు రిలీజైన పవన్ కల్యాణ్ సినిమా హరిహర వీరమల్లుకు భారీగా ధరలు పెంచుకునేందుకు పర్మిషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే.



## బాబాయ్ సినిమాను పట్టించుకోని రామ్ చరణ్!

పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన చిత్రం హరిహర వీరమల్లు. దాదాపు ఐదేళ్లపాటు షూటింగ్ చేసిన ఈ సినిమా ఎట్టకేలకు జూలై 24న థియేటర్లలో విడుదలైంది. ఎప్పటి నుంచి ఈ చిత్రం కోసం నిరీక్షించిన అభిమానులు భారీగానే ఆశలు పెట్టుకున్నారు. బాక్సాఫీస్ బద్దలవుతుందని రిలీజ్‌కు ముందు హల్‌చల్ చేశారు. కానీ తొలి ఆట నుంచే ఊహించని విధంగా ఫ్యాన్స్ నిరాశకు గురయ్యారు. ఉత్సాహంగా థియేటర్‌కు వెళ్లిన అభిమానులు.. బయటికి వచ్చేటప్పుడు మాత్రం ఆ జోష్ కనిపించలేదు. దీంతో తొలిరోజే వీరమల్లుకు పెద్ద షాక్ తగిలినట్లే అర్థమవుతోంది. అయితే హరిహర వీరమల్లు రిలీజ్ కావడంతో మెగా హీరోలంతా పవన్ కల్యాణ్ సినిమాకు ఆల్ ది బెస్ట్ చెబుతూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మెగా హీరోల్లో వరుణ్ తేజ్, సాయి ధరమ్ తేజ్ ట్వీట్ చేస్తూ సినిమా సక్సెస్ కావాలంటూ ట్వీట్ చేశారు. వీరితో పాటు పలువురు టాలీవుడ్ తారలు వీరమల్లు చిత్రం రిలీజ్ వేళ మద్దతుగా పోస్టులు పెట్టారు. అయితే మెగా హీరో, చిరంజీవి తనయుడు రామ్ చరణ్ మాత్రం బాబాయ్ సినిమా రిలీజ్‌కు ముందు ఎలాంటి పోస్ట్ చేయలేదు. ట్రైలర్ రిలీజ్ రోజు మాత్రమే పోస్ట్ పెట్టిన చెర్రీ.. హరిహర వీరమల్లు విడుదలకు ముందు ఎలాంటి విషెస్ చెప్పలేదు. దీంతో బాబాయ్ సినిమాకు చెర్రీ పోస్ట్ పెట్టకపోవడంపై నెటిజన్స్ చర్చించుకుంటున్నారు. మరోవైపు పెద్ది సినిమాతో బిజీగా ఉండడం వల్లే కుదరక పోయి ఉండొచ్చని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఏదేమైనా బాబాయ్ చిత్రానికి మెగా హీరో రామ్ చరణ్ సపోర్ట్ చేయకపోవడం గమనార్హం.

## చాలా ఆసక్తిగా ఉన్నా..
## పెళ్లిపై మృణాళ్ ఠాకూర్ కామెంట్స్ వైరల్



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ మృణాళ్ ఠాకూర్ ఈ భామ ప్రస్తుతం టాలీవుడ్ హీరో అడివిశేష్ నటిస్తోన్న డెకాయిట్‌లో హీరోయిన్‌గా నటిస్తోంది. మరోవైపు బాలీవుడ్ యాక్టర్ అజయ్ దేవ్‌గన్ నటిస్తోన్న సన్ ఆఫ్ సర్దార్ 2లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ప్రొఫెషనల్‌గా బిజీగా ఉన్న ఈ సుందరి తన వ్యక్తిగత జీవితం గురించి చెప్పిన మాటలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఏంటీ మృణాళ్ ఠాకూర్ షేర్ చేసింది పెళ్లి విషయమా.. ఏంటని ఆలోచిస్తున్నారా..? అయితే మీరనుకుంటున్నది నిజమే. కపిల్ శర్మతో చేసిన మృణాళ్ ఠాకూర్ చిట్‌చాట్‌లో ఇంట్రెస్టింగ్ విషయాన్ని వెల్లడించింది. తాను పెళ్లి చేసుకోవడం, పిల్లలను కనే విషయంలో చాలా ఆసక్తిగా ఉన్నట్టు వెల్లడించింది మృణాళ్ ఠాకూర్. అంతేకాదు తల్లి కావడం తనకు ఎప్పటి నుంచో ఉన్న కల అని కూడా చెప్పుకొచ్చింది. అయితే ఇప్పుడు మాత్రం పెళ్లికి సంబంధించి ఎలాంటి ప్లాన్ లేదని.. ప్రస్తుతానికి ఫోకస్ అంతా కెరీర్‌పైనే పెట్టానని స్పష్టం చేసింది. ఇక నిజాయితీ తన మనసులో మాట బయటపెట్టిన మృణాళ్ ఠాకూర్‌పై అంతా ప్రశంసలు కురిపిస్తున్నారు. షనీల్ డియో కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న డెకాయిట్ డిసెంబర్ 25న విడుదల కానుంది. డెకాయిట్ నుంచి రిలీజ్ చేసిన పోస్టర్‌లో మృణాల్ ఠాకూర్ ఓ చేత్తో స్టీరింగ్ తిప్పుతూ.. మరోచేతిలో పిస్తోల్ పట్టుకొని కనిపిస్తుంది. పక్కనే అడివి శేష్ సిగరెట్ వెలిగిస్తున్నాడు. హీరోహీరోయిన్లిద్దరూ ఏదో మిషన్‌లో పాల్గొంటున్నట్టుగా ఉన్న ఈ పోస్టర్ డెకాయిట్‌లో సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. మృణాళ్ ఠాకూర్ మరో నాలుగు సినిమాలను కూడా లైన్‌లో పెట్టింది.

## నాన్న ప్రతిరూపం మా తారకరాముడు..!
## అభిమానుల కళ్లు చెమ్మగిల్లేలా చేస్తున్న వీడియో



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ త్వరలోనే వార్2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ తో కలిసి వార్ 2 సినిమాలో నటిస్తున్నారు ఎన్టీఆర్. ఈ సినిమాతో పాటు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. అలాగే దేవర 2లోనూ నటిస్తున్నారు ఎన్టీఆర్. కాగా ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఇప్పుడు ఓ వీడియోను సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు. ఎన్టీఆర్ తండ్రి హరికృష్ణకు సంబంధించిన ఓ పాత వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ వీడియోలో హరికృష్ణను చూసిన నందమూరి ఫ్యాన్స్ అచ్చం ఎన్టీఆర్ లానే ఉన్నారు అంటూ తెగ మురిసిపోతున్నారు. అలాగే కొంతమంది ఎమోషనల్ కామెంట్స్ చేస్తున్నారు.

సోషల్ మీడియాలో హరికృష్ణకు సంబంధించిన ఓ పాత వీడియో చక్కర్లు కొడుతుంది. ఈ వీడియోలో హరికృష్ణ నవ్వుతూ మీడియాతో మాట్లాడుతూ కనిపించారు. ఈ వీడియాలో హరికృష్ణ.. అచ్చం జూనియర్ ఎన్టీఆర్ లానే ఉన్నారు. దాంతో నందమూరి అభిమానులు ఈ వీడియాను నెట్టింట తెగ షేర్ చేస్తున్నారు. హరన్నను చూస్తుంటే తారక్ అన్నాను చూసినట్టే ఉంది అంటూ కామెంట్స్ చేస్తున్నారు అభిమానులు. హరికృష్ణ హీరోగా ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించి మెప్పించారు. హరికృష్ణ ఓ రోడ్డు ప్రమాదంలో కన్ను మూసిన విషయం తెలిసిందే.. 2018, ఆగస్టు 29 న జరిగిన రోడ్డు ప్రమాదంలో హరికృష్ణ కన్నుమూశారు. ఉదయం 4:30గంటలకు హైదరాబాదు నుండి మరో ఇద్దరు వ్యక్తులతో కలసి స్వయంగా కారు నడుపుతూ కావలిలో జరగబోయే ఒక పెళ్ళికి వెళ్తున్న సమయంలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదం జరిగినపుడు కారు పలుసార్లు పల్టి కొట్టడం వలన తీవ్రగాయాలలైన హరికృష్ణను నార్కట్‌పల్లి లోని కామినేని హాస్పిటల్ కు తరలించి చికిత్స అందించారు, అయినా ఫలితం లేకపోయింది.

## స్టార్ నటులు లేకుండా
## వారం రోజుల్లో రూ.150 కోట్లు..
## బాలీవుడ్‌లో 'సైయారా' సంచలనం

బాలీవుడ్‌లో చిన్న సినిమాగా విడుదలై రికార్డులు సృష్టిస్తుంది సైయారా చిత్రం. ప్రేక్షకుల అంచనాలకు మించి ఈ చిత్రం వారం రోజుల్లోనే ఏకంగా రూ.150 కోట్ల భారీ వసూళ్లను రాబట్టి బాక్సాఫీస్ వద్ద సంచలనం క్రియేట్ చేస్తుంది. సాధారణంగా భారీ బడ్జెట్‌తో, పెద్ద స్టార్లతో తెరకెక్కే చిత్రాలు మాత్రమే ఈ స్థాయిలో వసూళ్లను సాధిస్తుంటాయి. అయితే, 'సైయారా' చిత్రం కంటెంట్ బలంగా ఉంటే చిన్న చిత్రాలు కూడా పెద్ద విజయాలను నమోదు చేయగలవని మరోసారి నిరూపించింది. ఆషికి 2, ఎక్ విలన్, ఆవరాపన్, వంటి చిత్రాలతో బ్లాక్ బస్టర్‌లు అందుకున్న దర్శకుడు మోహిత్ సూరి ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. ఈ చిత్రంతో ఆహాన్ పాండే, అనిత్ పడ్డా బాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చారు. లవ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం ఎటువంటి మౌత్‌టాక్ లేకుండా బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. తొలిరోజే రూ.21 కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రెండో రోజు రూ.24 కోట్లు, మూడో రోజు రూ.35 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఇక ఈ చిత్రం విడుదలైన ఆరు రోజులకే రూ.150 కోట్ల వసూళ్లను సాధించినట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో చాలా రోజుల తర్వాత బాలీవుడ్‌కి మంచి హిట్ వచ్చిందని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 'సైయారా' టీమ్ ఈ అనూహ్య విజయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తోంది.

